J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 28 13.12.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

### రాష్ట్రం విడిపోయినా ఆగని ఆగం..
### ఆంధ్రపై నోరుపారేసుకుంటున్న నేతలు

### రెచ్చిపోతున్న రేవంత్..
### నోరు విప్పని ఆంధ్రా నాయకులు

### భాషపై గుత్తాధిపత్యం మాదే అంటున్న..
### తెలంగాణలోని ఓ వర్గం మేధావులు

### శాస్త్రీయంగా సమాధానం చెప్పకుండా..
### మౌనంగా ఉంటున్న ఆంధ్రప్రాంత విజ్ఞానులు

# విద్వేషపు నీడలో రాజకీయ క్రీడ



**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి పదేళ్ళు దాటిపోయింది. ఉమ్మడి రాజధానికి కాలం కూడా తీరిపోయింది. అయినా, తెలంగాణ రాజకీయ నేతలలో మార్పు రావడంలేదు. తెలంగాణ ప్రజల మద్దతు కూడగట్టు కోవడానికి రాజకీయ నాయకులూ, పార్టీలూ భావోద్వేగం అంశంపైనే ఆధారపడుతున్నారు. అవకాశం వచ్చిన ప్రతిసారి ఆంధ్ర ప్రాంతంపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఆంధ్రులపై తప్పుడు ఆరోపణలతో పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఆంధ్ర ప్రాంతంపై నిరాధార నింద మోపారు.**

తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఉమ్మడి రాష్ట్రంలో, సమైక్య పాలనలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై జరిగిన దాడు లను అవహేళనలను, అవమానాలను మనం చూశాం" అని అన్నారు.

నిజానికి అవమానాలు పడుతున్నది ఆంధ్ర ప్రజలు. చేయని తప్పునకు ఎన్నాళ్ళు నిందలు వేస్తారు అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది ఆంధ్రులు. తెలంగాణ ఏర్పడిన తర్వాతే కాదు, అంతకు ముందు తెలంగాణ మలిదశ ఉద్యమం ప్రారంభం నుంచి కూడా ఆంధ్ర ప్రాంత ప్రజలు అవమా నించబడుతూనే ఉన్నారు. అవహేళనకు గురవుతూనే బ్రతుకు సాగిస్తున్నారు. మలిదశ ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లి తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించింది కల్వకుంట్ల చంద్రశేఖరరావు. తెలంగాణ ఏర్పాటు అయిన తర్వాత ఆ రాష్ట్రానికి ఆయన తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి పదేళ్ళు పాలించారు. ఆయన తొలినుండి ఆంధ్ర ప్రాంతంపైనా, ఆంధ్ర ప్రజలపైనా, అవాకులు చవాకులు పేలుతూనే ఉన్నారు. మాజీ అయినా ఇప్పటికీ ఆయన భాష మారలేదు. ఆంధ్రావాళ్ళు బిర్యానీ చేస్తే పేడలా ఉంటుందని అవహేళన చేస్తారు. ఆయన మేనల్లుడు, మాజీ మంత్రి హరీష్ రావు అయితే ఒకడుగు ముందుకేసి కొన్ని సందర్భాల్లో ఆంధ్ర ప్రాంత వ్యక్తులపై ఆ ప్రాంతం పేరుతో దూషిస్తూ దాడికి కూడా దిగారు. ఇన్ని జరుగుతున్నా... తెలంగాణలోని మేధావి సమాజం ఏనాడు నోరు మెదప లేదు. ఒక్కసారైనా ఇలాంటి చర్యలను వారు ఖండించలేదు. మన లక్ష్యం తెలంగాణ సాధనే తప్ప మరో ప్రాంత గౌరవాన్ని కించపరచడం కాదు అని తమ నేతలకు బుద్ధి చెప్పలేదు. ఆంధ్ర ప్రాంతపు మేధావి వర్గం కూడా రాష్ట్రం సమైక్యంగా ఉండాలని డిమాండ్లు చేసి ఉద్యమాలు చేశారు. అంతే తప్ప ఆంధ్ర ప్రాంతాన్ని అవమానించడం తప్పు అని ఏనాడు ప్రశ్నించలేదు. ఇక ఆంధ్ర ప్రాంతపు రాజకీయ నాయకుల సంగతి సరేసరి. వాళ్ళంతా రెండుకళ్ళ సిద్ధాంతంతో గోడమీద పిల్లిలా వ్యవహరించారు. అంతే తప్ప రాష్ట్ర సాధన పేరుతో ఆంధ్ర ప్రజలని, వారి

10లో




## ప్రధాని మోడీని కలిసిన.. ఎంపీ వేమిరెడ్డి దంపతులు

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని.. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. ఆయన సతీమణి.. తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు గౌరవ పూర్వకంగా కలిశారు. గురువారం ఢిల్లీలో ప్రధానమంత్రి కార్యా లయానికి వెళ్లిన వేమిరెడ్డి దంపతులు, ప్రధాని మోడీని కలసి శాలువాతో సత్కరించారు. దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న ప్రధానికి, వేమిరెడ్డి దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు. దేశాన్ని అగ్రపథాన నిలుపుతున్న ప్రధాని నరేంద్ర మోడీని కలవడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు.

నెల్లూరుజిల్లాతో పాటు రాష్ట్రంలో, దేశంలోని పలు ప్రాంతాలలో వేమిరెడ్డి దంపతులు చేస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల గురించి తెలుసుకున్న ప్రధాని మోడీ ముగ్ధుడయ్యారు. ప్రభాకర్‌రెడ్డి – ప్రశాంతమ్మ దంపతులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.







# శ్రీసిటీలో 'ఈప్యాక్' విస్తరణ

## రూ.191 కోట్ల పెట్టుబడితో గృహోపకరణాల తయారీ



అంతర్జాతీయస్థాయిలో ఖ్యాతిగాంచిన శ్రీసిటీలోని ఈప్యాక్ డ్యూరబుల్ లిమిటెడ్ (ఇడిఎల్) పరిశ్రమ ఈనెల 7న తమ అదనపు ఉత్పత్తి కేంద్రానికి భూమిపూజ చేపట్టింది. గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, ఏసీల తయారీలో గ్లోబల్ లీడర్ అయిన హైసెన్స్ సంస్థతో వ్యాపార భాగస్వామ్యంలో భాగంగా ఈ నూతన ప్లాంట్ నిర్మాణాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఈప్యాక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అజయ్ సింఘానియా, డైరెక్టర్ ఎల్ బి బోత్రా, హైసెన్స్ ఇండియా సీఈఓ పంకజ్ రాణా, మేనేజింగ్ డైరెక్టర్ స్టీవెన్‌లీ తదితరులు పాల్గొన్నారు. హైసెన్స్ సంస్థ రూపొందించిన సాంకేతికత, డిజైన్ల మేరకు ఎయిర్ కండిషనర్లు, వాషింగ్ మెషీన్‌లు, రిఫ్రిజిరేటర్‌లు, ఇతర చిన్న చిన్న గృహోపయోగకరమైన వస్తువుల ఉత్పత్తికి అవసరమైన తయారీ లైన్లను ఈ నూతన ఉత్పత్తి కేంద్రంలో నిర్మించడం జరుగుతుంది. భారతదేశంలో హైసెన్స్ ఉనికిని బలోపేతం చేయడం, ప్రపంచ మార్కెట్ అవసరాలను తీర్చడం లక్ష్యంగా ఈప్యాక్ పాత, కొత్త ప్లాంట్లు పనిచేయనున్నాయి. ఈ సందర్భంగా హైసెన్స్, ఈప్యాక్ యాజమాన్యాలను అభినందించిన శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఈ భాగస్వామ్యం పారిశ్రామికంగా శ్రీసిటీని మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఏసీల తయారీ కేంద్రంగా శ్రీసిటీకి ఇది మరో ముందడుగు అని ఆయన అభివర్ణించారు.

### జూన్ నాటికి ఉత్పత్తులు ప్రారంభం :

రూ.91కోట్ల పెట్టుబడితో 9 ఎకరాల విస్తీర్ణంలో ఈప్యాక్ అదనపు ప్లాంట్ నిర్మాణం చేపట్టిన నేపథ్యంలో, జూన్ 2025 నాటికి ఉత్పత్తులు ప్రారంభం కావచ్చని భావిస్తున్నారు. ఈ ప్లాంట్ సంవత్సరానికి 1.3 మిలియన్ ఎయిర్ కండిషనర్లు, 0.4 మిలియన్ వాషింగ్ మెషీన్లు, 0.7 మిలియన్ చిన్నచిన్న గృహోపకరణాలను ఉత్పత్తి చేస్తుంది. రెండు ప్లాంట్లతో ఎయిర్ కండిషనర్ల ఉత్పత్తి సామర్థ్యం 2 మిలియన్ యూనిట్లకు పెరుగుతుంది. ప్రస్తుతం ఈప్యాక్ పరిశ్రమలో 700 మంది పనిచేస్తుండగా, నూతన ఉత్పత్తి కేంద్రంతో మరో 500 మందికి ఉద్యోగ అవకాశాలు కూడా లభించనున్నాయి.



## గొలగమూడిలో 14న

# శ్రీ దత్త జయంతి

వెంకటాచలం మండలం, గొలగమూడి గ్రామంలోని శ్రీ గురు ధ్యాన నిలయంలో ఈనెల 14న శ్రీ దత్త జయంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గురు ధ్యాన నిలయం ఆధ్వర్యంలో స్వామివారి పూజా కార్యక్రమాల నిర్వహణకు సమాయత్తమవుతున్నారు. ఈ సందర్భంగా ఆరోజు ఉదయం 8 గంటలకు శ్రీ దత్తాత్రేయ స్వామివారికి అభిషేకం అనంతరం, 9.30 గంటలకు శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం ఉంటుందని, వ్రతానికి కావాల్సిన అన్ని వస్తువులు ఆశ్రమం వారే సమకూరుస్తారని గురు ధ్యాన నిలయం నిర్వాహకులు తెలియజేశారు. ఈ వ్రతంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న భక్తులు ఒకరోజు ముందే తమ పేర్లు నమోదు చేసుకుంటే వారికి అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఆ మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందని, భక్తులందరూ ఈ పూజల్లో పాల్గొని స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని వారు విజ్ఞప్తిచేశారు. వివరాలకు 990822 68658 లేదా 92814 61245 ఫోన్ నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.





# భుజం నొప్పితో బాధలు పడకండి

- అపోలో ఆసుపత్రిలో విజయవంతంగా శస్త్రచికిత్సలు
- కేవలం 6 వారాల్లోనే కోలుకునే అవకాశం

భుజం నొప్పితో బాధలు పడేవారికిది శుభవార్త. అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యాధునిక రోబోటిక్ విధానం ద్వారా భుజం మార్పిడి శస్త్రచికిత్సలు (షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు) అందుబాటులోకి రావడమే కాక, ఈ ఆపరేషన్లు విజయవంతంగా జరుగుతున్నాయి. దీర్ఘకాలంగా భుజం నొప్పి అధికంగా ఉన్నవారు, సాధారణ శస్త్ర చికిత్సల ద్వారా నయం చేయలేని ఎముక పగుళ్లు ఉన్నవారు, భుజం ఆపరేషన్లు విఫలమైన వారికి ఈ రోబోటిక్ విధానం ద్వారా షోల్డర్ రీప్లేస్ మెంట్ శస్త్రచికిత్స చేస్తే మంచి ఫలితం ఉంటుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ఆ ఆసుపత్రికి చెందిన షోల్డర్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ పమ్మి కార్తీక్‌రెడ్డి, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మదన్ మోహన్‌రెడ్డి ఈ విషయాలు చెప్పారు. ఈనెల 8న నెల్లూరులో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, గతంలో ఉన్న సంప్రదాయ చికిత్సల అనంతరం, నేడు అధునాతనమైన ఈ శస్త్రచికిత్సల్లో ఇప్పుడు నూతన శకం ఆరంభమైందన్నారు. భుజం కీలులో దెబ్బతిన్న భాగాలను ముందుగా తొలగిస్తామని, వాటి స్థానంలో ఎంతో సురక్షితమైన కృత్రిమ భాగాలను అమరుస్తామన్నారు. దీంతో, భుజం నొప్పి త్వరగా తగ్గిపోయి ఉపశమనం లభిస్తుందని, రీప్లేస్‌మెంట్ ద్వారా అమర్చే ఇంప్లాంట్స్ ఎక్కువ కాలం ఉంటాయని వెల్లడించారు. రోగి కేవలం ఆరు వారాల్లోనే తిరిగి తన పనులు తాను చేసుకోవచ్చునని, రోజువారీ సాధారణ వ్యాయామాలు కూడా చేసుకోవచ్చని వివరించారు. అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో రోబోటిక్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు నూటికి నూరు శాతం విజయవంతంగా చేస్తున్నామని, ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# ఆత్మకూరులో ఆటల పోటీలు



నెహ్రూ యువ కేంద్ర (నెల్లూరు)-క్రీడ్ హెడ్స్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 10న బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు జరిగాయి. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ పోటీల్లో పురుషులకు వాలీబాల్, 100 మీటర్ల పరుగుపందెం, షాట్ పుట్ పోటీలు, స్త్రీలకు ఖోఖో, 100 మీటర్ల పరుగు, షాట్ పుట్ క్రీడా పోటీలను నిర్వహించి, విజేతలకు ప్రశంసా పత్రాలు, పతకాలు, ట్రోఫీలు అందజేశారు. జిల్లా యువజన అధికారి ఏ.మహేంద్రరెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్యానికి క్రీడలు ఎంతో ముఖ్యమని, విద్యార్థులు-యువత ప్రతిఒక్కరూ క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని చెప్పారు. సెక్టెల్ సీఇఓ శ్రీనివాసులు, గయాజ్ , శ్రీహరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈనెల 13న కావలి పట్టణంలో, 18న కందుకూరు పట్టణంలో, 21న నెల్లూరు నగరంలోనూ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని వారు ఈ సందర్భంగా తెలియజేస్తూ, ఆసక్తి కలిగిన యువత 9963533440 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

## సందేశాత్మకంగా చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్

# 'అంతరంగ వీక్షణం' పరిచయ సభ



నినాదం కవిత్వం కాదు. చదివిన వాళ్ళను ఆనందడోలికల్లో ఊగించేది కవిత్వం అంటారు ప్రముఖకవి, విమర్శకులు లక్ష్మీనరసయ్య. సమాజాన్ని మెరుగు పరిచేది కవిత్వమే తప్ప సమాజాన్ని తప్పుదారి పట్టించేది కాదని స్పష్టం చేశారు. విల్సన్‌రావులో తెరవెనుక మరో మనిషి ఉన్నారని 35 మంది పేరెన్నికగన్న కవుల నుంచి, ఇప్పుడిప్పుడే బాగా రాస్తున్న కవుల అభిప్రాయాలు ఈ పుస్తకంలో ఇంటర్వ్యూలుగా చోటు చేసుకొన్నాయి. ఇందులో కొమ్మవరపు విల్సన్‌రావు వేసిన వైవిధ్యమైన ప్రశ్నలకు వివిధ కోణాల నుంచి కవులు ఇచ్చిన సమాధానాలు చాలా వివరణాత్మకంగా ఉన్నాయి అని పేర్కొన్నారు. సాహిత్యం సమాజాన్ని మెరుగు పరచలేకపోయినా సమాజంలో వింత పోకడలకు పోకుండా స్థిరంగా ఉండేలా చేయాలని, ద్రౌపదిలా అయిదుగురు భర్తల్ని ఎవరూ కోరుకోరని సాహిత్యంపై గొప్ప ప్రసంగం గావించారాయన. చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్, నెల్లూరు తరపున 'అంతరంగ వీక్షణం' పరిచయ సభను నెల్లూరు టౌన్‌హాల్ ఏసి పురమందిరంలో ఈనెల 8వ తేదీ ఉదయం నిర్వహించారు. విక్రమ సింహపురి ఉప కులపతి ఆచార్య యస్.విజయభాస్కరరావు 'అంతరంగ వీక్షణం' పుస్తకాన్ని ఆవిష్కరించి కవిత్వం వేదికగా సాగుతున్న చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్‌ను అభినందిస్తూ ప్రసంగించారు.

సభాధ్యక్షులు, చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ అధ్యక్షులు చిన్ని నారాయణరావు మాట్లాడుతూ సాహితీ కార్యక్రమాల వృద్ధికి, సాహిత్యాభివృద్ధికి ఈ ఫౌండేషన్ ప్రారంభించినట్లు చెప్తూ తొలుత నవ మల్లెతీగతో కథల పోటీ నిర్వహించి బహుమతులు అందజేశామని, గత సంవత్సరం యాకూబ్‌కు అవార్డు ఇచ్చినట్లు, తెలుగు అకాడమీ ఛైర్మన్ లక్ష్మీపార్వతి పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం కవిసంధ్యలో కవితల పోటీ నిర్వహణకు ఫౌండేషన్ నడుంకట్టిందని పేర్కొన్నారు.

అనేకమంది యువకవులు, కవయిత్రులు, పేరొందిన కవులు ఈ సభలో పాల్గొనగా పోటీలో ముగ్గురు బహుమతులు గెలుపొందారు. వారికి ఫౌండేషన్ తరపున ఒక్కొక్కరికి రూ.500/-లు బహుమతిగా ఇవ్వడం జరిగింది. ప్రతి కవినీ లక్ష్మీనరసయ్య సత్కరించి గౌరవించారు. సభను గోవిందరాజు సుభద్రాదేవి నిర్వహించగా, సాహితీవేత్తల ముఖాముఖి ఇంటర్వ్యూలను నిర్వహించి పుస్తకంగా ప్రచురించిన కొమ్మవరపు విల్సన్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఒంగోలు కవి ఎజ్రాశాస్త్రి, విశాలాక్షి పత్రిక సంపాదకులు ఈతకోట సుబ్బారావులు పాల్గొని ప్రసంగించారు.

సభ హుందాగా జరిగిన తీరును అందరూ ప్రశంసించారు, అభినందించారు. కవులు గంగిశెట్టి శివకుమార్, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, అవ్వారు శ్రీధర్ బాబులు పాల్గొని సభను విజయవంతం చేశారు.

ఏది కవిత్వం, ఏది కవిత్వం కాదని, కవిత్వం చేయాల్సిన విధానాల్ని కవి, విమర్శకులు లక్ష్మీనరసయ్య సోదాహరణంగా వివరించారు.

# జడ్పీలో.. డాక్టర్ అంబేద్కర్ వర్ధంతి



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలు ఇటీవల నెల్లూరులోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత డా. అంబేద్కర్ చిత్రపటానికి జడ్పీ డెప్యూటీ సీఇఓ జే.మోహన్‌రావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# రాజ్యసభకు మరోసారి మస్తానయ్య!

నెల్లూరుజిల్లాలో గుర్తింపు ఉన్న రాజకీయ నాయకులలో బీద మస్తాన్‌రావు ఒకరు. అలాగే బిఎంఆర్ సంస్థల వ్యవస్థాపక ఛైర్మెన్‌గా, భారతదేశ ఆక్వా రంగంలో ప్రముఖ వ్యాపారవేత్తగా సైతం మస్తానయ్య మంచి కీర్తి ప్రతిష్టలు సంపాదించారు. తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయ రంగప్రవేశం చేసిన మస్తాన్‌రావు కొన్ని అనివార్య పరిస్థితుల వల్ల వైసీపీ తీర్థం పుచ్చుకుని తొలిసారిగా రాజ్యసభకి ఎంపికయ్యారు. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం - బీజేపీ - జనసేన కూటమి అధికారంలోకి రావడంతో ఆయన తన రాజ్యసభ సభ్యత్వానికి, వైసీపీకి రాజీనామా చేసి మళ్ళీ పుట్టింటికి వెళ్లి పోయిన సంగతి తెలిసిందే! ఇప్పుడు తెలుగుదేశం పార్టీ మస్తాన్‌రావుకు సముచిత స్థానం కల్పించింది. ఆయన రాజీనామా చేసిన స్థానంలో మళ్ళీ ఆయనకే అవకాశం కల్పించింది. పార్టీ అభీష్టం మేరకు ఆయన మొన్న డిసెంబర్ 10వ తేదీ మంగళవారం రాజ్యసభకి తన నామినేషన్ దాఖలు చేశారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్, వ్యవసాయశాఖా మాత్యులు కింజరపు అచ్చెన్నాయుడు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరుల సమక్షంలో ఆయన నామినేషన్ వేశారు. పోటీ లేదు కాబట్టి ఆయన ఎంపిక ఏకగ్రీవమే. నామినేషన్ వేసిన అనంతరం ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం 13వ తేదీ, మస్తానయ్య గెలుపుని అధికారికంగా ప్రకటిస్తారు. మొత్తానికి మరోసారి పెద్దల సభకి వెళ్ళబోతున్న మస్తానయ్యకి 'లాయర్' అభినందనలు.



## నాగాలాండ్ ముఖ్యమంత్రితో
# మన నెల్లూరీయుడు రాజ్ కిషోర్ భేటీ!

ఎయిర్‌పోర్ట్ అథారిటీస్ ఆఫ్ ఇండియా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సెవెన్ సిస్టర్స్‌గా ఖ్యాతిగాంచిన ఈశాన్య(నార్త్ ఈస్ట్) రాష్ట్రాలలో తన సేవలందిస్తున్న మన నెల్లూరీయుడు రాజ్‌కిషోర్ ఇటీవల నాగాలాండ్ ముఖ్యమంత్రి నేప్యురియోతో సమావేశమయ్యారు. నాగాలాండ్‌లోని డిమాపూర్ ఎయిర్‌పోర్టు అభివృద్ధికి సంబంధించి తీసుకోవలసిన చర్యలపై రాజ్‌కిషోర్‌తో ముఖ్యమంత్రి సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకున్నారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా ఎయిర్‌పోర్టుని తీర్చిదిద్దడంతో పాటు, రవాణా సదుపాయాలని మెరుగుపరచే విధంగా డిమాపూర్ విమానాశ్రయాన్ని తీర్చిదిద్దాలని నాగాలాండ్ సీఎం రాజ్‌కిషోర్‌ని కోరారు. రాజ్‌కిషోర్‌తో పాటు ఎయిర్‌పోర్ట్ అథారిటీస్ ఆఫ్ ఇండియా అధికార బృందం కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. అఖిల భారత స్థాయిలో విమానాశ్రయ రంగంలో గుర్తింపు తెచ్చుకుంటున్న రాజ్‌కిషోర్‌కి 'లాయర్' అభినందనలు.

# నేటి బాలలే.. భావిభారత పౌరులు

## - కెఎన్ఆర్ స్కూల్‌లో ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి



నేటి బాలలే.. భావిభారత పౌరులని, బాలల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన నెల్లూరులోని కెఎన్ఆర్ స్కూల్‌లో జరిగిన తల్లితండ్రులు-ఉపాధ్యాయుల సమావేశంలో, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సమావేశాలు ఏర్పాటుచేస్తోందన్నారు. విద్యారంగం అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో కెఎన్ఆర్ పాఠశాల ఉత్తమ ఫలితాలు సాధిస్తూ జిల్లాలోనే ఈ స్కూల్ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుందని అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకులు సాధించి పాఠశాలను అగ్రగామిగా నిలపాలని సూచించారు. ఎంపీ వేమిరెడ్డికి ఈ పాఠశాలతో ప్రత్యేక అనుబంధం ఉందని, 2015లో 3లక్షల రూపాయల సొంత నిధులు విరాళంగా అందించి పాఠశాల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, జనసేన నాయకులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హోటళ్ళలో నిబంధనలు పాటించాలి

## • నాణ్యత లేకుంటే చర్యలు తప్పవన్న కమిషనర్



నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న హోటళ్ళు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులకు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ ఆధ్వర్యంలో ఈనెల 11న అవగాహన సదస్సు నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ఈ సదస్సులో జిల్లా ఫుడ్‌సేఫ్టీ విభాగం, నగరపాలక సంస్థ ఆరోగ్య విభాగాల అధికారులతో కలిసి కమిషనర్ హోటళ్ళ వారికి క్లాస్ తీసుకున్నారు. హోటళ్ళలో పరిశుభ్రత, ఆహార పదార్థాల్లో నాణ్యత ఉండడం లేదన్న విమర్శలతో కమిషనర్ రంగంలోకి దిగి, హోటళ్ళలో ఎలాంటి నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలో వారికి వివరించారు. హోటళ్లలో పరిశుభ్రత పాటించాలని, పరిసరాల పరిశుభ్రతను కూడా దృష్టిలో పెట్టుకుని, ఆ ప్రాంగణాలన్నీ నిరంతరం శుభ్రంగా ఉంచాలని చెప్పారు. వంటలు చేసే ప్రాంతాలు, కిచెన్‌లు అన్నీ ఇంకా పరిశుభ్రంగా ఉండాలని, ఎక్కడా దుర్గంధం లేకుండా చూడాలన్నారు. నిల్వ ఆహారపదార్థాలను ఫ్రిజ్‌లలో పెట్టకూడదన్నారు. వంటల తయారీలోనూ పరిశుభ్రత ఉండాలన్నారు. శాఖాహార, మాంసాహార పదార్థాలను విడివిడిగా ఉంచాలని, అన్నిటినీ ఒకేచోట కలిపేసేలా పెట్టడం సరికాదన్నారు. ఆహారపదార్థాలను వినియోగదారులకు అందజేసే సందర్భంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. ఆహారపదార్థాల తయారీలో నిషేధిత రంగులను వాడకూడదని, కల్తీ పదార్థాలను వినియోగించరాదని, నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రతలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, అదనపు కమిషనర్ నందన్, కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవి త్యాగం అజరామరం

## • శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణలో ఎంపీ వేమిరెడ్డి



నెల్లూరుజిల్లా ముద్దుబిడ్డ, అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగనిరతి అజరామరమని, ఆ మహనీయుని జీవితం భవిష్యత్తు తరాలకు ఆదర్శనీయమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 8న కందుకూరు పట్టణంలో ఆర్యవైశ్య సభ్యులు నూతనంగా ఏర్పాటు చేసిన అమరజీవి కాంస్య విగ్రహ ఆవిష్కరణలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత, పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకుని, ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి, డూండి రాకేష్ ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు జిల్లా ప్రతిష్టను దేశవ్యాప్తం చేసిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లావాసి కావడం గర్వించదగ్గ విషయమన్నారు. అలాంటి మహోన్నతమైన వ్యక్తిని గుర్తుచేసుకుంటూ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేసిన కందుకూరు ఆర్యవైశ్య సభ్యులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. విగ్రహాలు మన గత చరిత్రకు నిదర్శనాలని, శ్రీ పొట్టి శ్రీరాములు వంటి మహానుభావుల చరిత్రను, గొప్పతనాన్ని భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా తెలియజేయాలని సూచించారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ, శ్రీ పొట్టి శ్రీరాములు మద్రాసులో తెలుగు ప్రజల ఇబ్బందులు గమనించి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను సైతం త్యాగం చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ రాకేష్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని డిసెంబర్ 15 ఆత్మార్పణ దినోత్సవంగా జరపాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి రాష్ట్ర ఆర్యవైశ్యుల సంఘం తరఫున ప్రత్యేక ధన్యవాదాలన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ తటవర్తి వాసు, దర్శి హరికృష్ణ, ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పి.వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులు కోటా హనుమంతరావు పాల్గొన్నారు.

# నాగమ్మ గుడి కూల్చివేత దారుణం

## - బీజేపీ నాయకుల ఆగ్రహం



నెల్లూరు డైకస్‌రోడ్డులో గత నాలుగు దశాబ్దాలుగా ఉన్న నాగమ్మ ఆలయాన్ని రోడ్డు విస్తరణ కోసమని ఉన్న ఫళంగా కూల్చివేశారంటూ బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ నాయకుడు.. నమామి గంగే ప్రముఖ్ మిడతల రమేష్ ఈనెల 11న ఆ సంఘటనపై మాట్లాడుతూ, తామేమీ రోడ్డు విస్తరణకు వ్యతిరేకం కాదని, అయితే కనీసం ప్రత్యామ్నాయం చూపకుండా, అప్పటికప్పుడు నాగమ్మదేవత గుడిని కూల్చడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయంలో ఉన్న లక్ష్మీదేవి విగ్రహం, విఘ్నేశ్వరుని విగ్రహాలను కూడా వారి చిత్తానుసారం తొలగించేశారని, నిబంధనలేమీ పాటించకుండా ఇలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడడాన్ని జిల్లా అధికారులు పరిశీలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్థానిక నాయకులు కరణం వెంకట్రావ్, మణి, కోటయ్య తదితరులంతా ఈ ఘటన పట్ల నిరసన వ్యక్తం చేశారు.

లాయర్
డిసెంబర్ 13, 2024

# మానసిక ప్రశాంతతకు 'ధ్యానం'.. దివ్యౌషధం!

**డిసెంబరు 21..**

ఈ తేదీకి ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడెంతో ప్రాధాన్యత లభించింది. తాజాగా ఆరోజును ఐక్యరాజ్యసమితి 'ప్రపంచ ధ్యాన దినోత్సవం'గా ప్రకటించడం ఒక అద్భుతం!..మానవాళి జీవిత విధానంలో మంచి మార్పులు తీసుకువచ్చే శుభదినం. అనేకరకాల సమస్యలు సంక్షోభాలతో సతమతమవుతూ మానవుడు అశాంతికి గురవుతున్న ప్రస్తుత నేపథ్యంలో, సకల మానవాళికి మానసిక శాంతిని.. ప్రశాంతతను చేకూర్చే దివ్యౌషధం.. ధ్యానమే!. అందుకే ధ్యానానికి అంతటి విశిష్టత. ధ్యానాన్ని ఆచరించాలంటూ ప్రపంచదేశాలన్నీ ముక్తకంఠంతో కోరుతున్నాయి. ప్రతిఏటా డిసెంబరు 21వ తేదీని 'ప్రపంచ ధ్యాన దినోత్సవం'గా నిర్వహించాలని కూడా ఐరాస (ఐక్య రాజ్యసమితి) సభ్యదేశాలు ప్రతిపాదించాయి. భారత్‌తో సహా పలు దేశాలు ప్రతిపాదించిన ఆ తీర్మానానికి గత శుక్రవారం 193 సభ్యదేశాలతో కూడిన ఐరాస సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించడం నిజంగానే ఒక చరిత్రాత్మక ఘట్టంగా భావించ వచ్చు. 'సమగ్ర శ్రేయస్సు, అంతర్గత పరివర్తన కోసం ఒకరోజు.. అంటే, డిసెంబరు 21వ తేదీన ప్రపంచ ధ్యాన దినోత్సవంగా జరపాలని నిర్ణయించడం, ఇతరదేశాలతో కలిసి మన భారతదేశం అందుకు మార్గదర్శనం చేయడం గర్వ కారణం. 'ప్రపంచ ధ్యాన దినోత్సవం' విశిష్టతను ఐక్యరాజ్య సమితిలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఇటీవల 'ఎక్స్' వేదికగా తెలియజేయడంతోపాటు, ఆ తేదీకి ఉన్న వైశిష్ట్యాన్ని కూడా ప్రపంచానికి వివరించారు. 'భారత సంప్రదాయం ప్రకారం డిసెంబరు 21వ తేదీకి ఎంతో ప్రాధాన్యత ఉందని, ఆరోజున శీతాకాల అయనాంతం, అంటే ఉత్తరాయనంలోకి అడుగుపెట్టే రోజు కనుక, భారతీయులు ఆరోజును పవిత్రమైన రోజుగా భావిస్తారని' కూడా పేర్కొన్నారు. వేసవి అయనాంతం అంటే దక్షిణాయనంలోకి అడుగు పెట్టేరోజు (జూన్ 21)న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించు కోవాలనే భారత్ ప్రతిపాదనకు పదేళ్ళక్రితం ఐక్యరాజ్యసమితి ఆమోదముద్ర వేయడం, నాటి నుంచి ప్రతిఏటా యోగా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా ఘనంగా జరుగుతుండడం విదితమే. వేసవికాలంలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకున్న సరిగ్గా ఆరునెలల తర్వాత, శీతాకాలంలో ఈ 'ధ్యాన దినోత్సవం' కూడా ఆచరణలోకి వస్తుంది.

నేటి ఆధునిక కాలంలో మానవుడికి విశ్రాంతి అన్నదే ఉండడం లేదు. నిత్యజీవన యానంలో జీవితమంతా యాంత్రికంగా గడిచిపోతూనే ఉంది. అయినా.. ఎంత చేసినా ఏదో ఒక అశాంతి, లేదా అసంతృప్తి వెంటాడుతూనే ఉన్నాయి. మానసిక ప్రశాంతత లోపించి మనసంతా ఏదో తెలియని నిరాశతో నిండిపోతోంది. ఇది ఏ ఒక్కదేశంలోనో కాదు, అన్నిదేశాల్లోనూ, మానవులందరిలోనూ ఇది నిత్యకృత్యం అయిపోతోంది. ఈ నేపథ్యంలో, అశాంతి నుంచి శాంతిలోకి, అసంతృప్తిలోంచి ప్రశాంతతలోకి జీవనం సాగించాలంటే అందుకు సరైన మార్గదర్శనం చేయగలిగే సాధనం..'ధ్యానం' ఒక్కటేనన్నది నిపుణుల నిశ్చితాభిప్రాయం. మనదేశంలో ప్రాచీనకాలం నుంచి, మన మహర్షులు ఆచరించి చూపిన యోగా, ధ్యానం వంటివి అటు శారీరక, ఇటు మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతున్నాయి. నేడు ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో యుద్ధాలు, ఇంకొన్ని దేశాల్లో యుద్ధ భయాలు, అనేకదేశాల్లో చెప్పలేనన్ని సంక్షోభాలు చుట్టు ముడుతున్న వేళ.. అంతటా అశాంతే ఆవరిస్తోంది. ఆ వత్తిడుల నుంచి బయటపడేందుకు, ఎవరికి వారు అంతర్గత పరివర్తనతోశాంతి స్థాపనకు మార్గం వేసుకునేందుకు ఒక అద్భుతమైన సాధనంగా 'ధ్యానం' ఉపయోగపడుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అయినా, ధ్యానంతో కలిగే సంతోషం ఇంతా అంతా కాదు, అదో అలౌకికమైన ఆనందం. ఏదేమైనా, అంతటి మహత్తరమైన ధ్యానశక్తిని ప్రపంచానికి అందించాలన్నదే భారత్ తపన కూడా. ధ్యానం శాంతికి, ఆ తర్వాత విశ్వశాంతి కల్యాణానికి కూడా దోహదం చేస్తుందని నమ్మకం. అంతర్గత పరివర్తనతో కక్షలు, కార్పణ్యాలు, యుద్ధాలు విడనాడి, మానవులంతా ఒకటేనన్న భావనతో, అందరూ ఒకే కుటుంబంలా జీవించాలంటే ముందు మానసిక ప్రశాంతత ఉండాలి. అందుకు మంచిమార్గం వేసేదే.. ధ్యానం. ఆ లక్ష్యసాధనకు ప్రపంచదేశాలన్నీ కలిసిరావడం శుభపరిణామం. అయితే, కేవలం ధ్యానం చేయడంతోనే సరి పెట్టుకోక, అంతర్గత పరివర్తనతో సకల మానవాళికి శుభాలు చేకూర్చాలనే ధ్యేయంతో, అందరూ కలిసికట్టుగా ముందుకు సాగితే, శాంతిమాత ప్రశాంత కిరణాలు వాటంతటవే ప్రసరించి.. ప్రపంచాన్ని మరింత ప్రకాశమానం చేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

**(డిసెంబరు 21, ప్రపంచ ధ్యాన దినోత్సవం)**

# జగన్‌బాబుకి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఇన్నాళ్ళకి గుర్తొచ్చారా?

వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సంక్రాంతి పండుగ తరువాత జిల్లాలలో పర్యటిస్తానని ఇటీవల ప్రకటించారు. ఒక్కొక్క జిల్లాలో రెండురోజులపాటు బసచేస్తానని కూడా చెప్పారు. ఆ రెండురోజులూ పార్టీ శ్రేణులతోనూ కార్యకర్తలతోనూ ఆయన మమేకమవుతాడంట. అబ్బా... ప్రజలు ఆయనని ఓడించి ఇంట్లో కూర్చోబెట్టిన 6 నెలలకి జగన్‌బాబుకి పార్టీ శ్రేణులు గుర్తొచ్చినట్లున్నారే...! తాను సీఎం కాకముందు ఓదార్పు యాత్ర, ప్రజాసంకల్ప యాత్ర అంటూ నిత్యం జనంలోనే ఉండేవాడు జగన్‌బాబు. తాను ముఖ్యమంత్రి అయ్యాక పులివెందులలో మినహా ఒక్క రాత్రి కూడా ఆయన తాడేపల్లి ప్యాలస్ వదిలి బయట జిల్లాలో ఎక్కడా నిదర చేసిన దాఖలాలు లేవు. జిల్లాల పర్యటనలకి వచ్చినా సాయంత్రం 5 గంటలకల్లా పక్షులు గూటికి చేరినట్లు ఆయన తాడేపల్లి ఇంటికి చేరేవాడు. ఏనాడు పార్టీ శ్రేణులని కానీ, కార్యకర్తలని కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. పైగా ఆయన పర్యటించిన చోటల్లా ఆయన కోసం ప్రాణాలొడ్డి పనిచేసిన సామాన్య కార్యకర్త ఆయన దగ్గరకి వెళ్లాలన్నా భయపడేవిధంగా తన చుట్టూ భద్రతా వలయాన్ని ఏర్పరచుకుని వచ్చి పోయేవాడు. మళ్ళీ ఇప్పుడు జిల్లాలలో పర్యటించి ఉద్ధరిస్తానని చెప్తున్నాడు. అయ్యా జగన్ బాబూ!... అయిదేళ్ళు అధికారంలో ఉన్నప్పుడు నీకు కనపడని పార్టీ శ్రేణులకి, కార్యకర్తలకి ఇప్పుడు భరోసా కల్పించడానికి వస్తున్నానంటే నమ్మడానికి వాళ్ళేమీ అమాయకులు, పిచ్చోళ్ళు కాదు. నువ్వు మళ్ళీ వాళ్ళ చెవిలో పువ్వు పెట్టడానికి వస్తున్నావని వాళ్ళకి బాగా తెలుసు.

**జీ.వీ.సుబ్బయ్య, పిడుగురాళ్ల.**

# 'గొట్టంగాళ్ళకి' కోర్టు చెంపపెట్టు!

యూట్యూబ్ ఛానెళ్ళు పెట్టుకుని, చేతిలో గొట్టం(మైకు) పట్టుకుని తిరుగుతూ చాలామంది తాము జర్నలిస్టులమని చెప్పుకుంటూ చలామణీ అవుతున్నారు. అలాంటి వారికి ఇటీవల హైకోర్టు చెంప చెళ్లుమనిపించిందని పత్రికలలో చదివి సంతోషమేసింది. అలా గొట్టాలు పట్టుకుని తిరిగేవాళ్లంతా జర్నలిస్టులు కాలేరంటూ హైకోర్టు తీర్పు చెప్పడం హర్షణీయం. ఓనమాలు కూడా రానివాళ్ళు సైతం గొట్టాలు పట్టుకుని, తమ వాహనాలపైన ప్రెస్ అని రాసుకుని తిరిగేస్తున్నారు. అధికారులు, రాజకీయ నాయకులు ఇప్పటికైనా మేలుకుని ఇలాంటి వారిని దూరం పెట్టాలని కోరుతున్నా. **– ఆర్.పీ.రామయ్య, కొండాయపాలెం, నెల్లూరు.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# రెండు కళ్ళూ, రెండు చెవులూ సరిపోవడంలేదు!

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలలో మన ఆంధ్రా ఏం.పి.లు మాట్లాడుతున్న తీరు చూస్తుంటే కనుల పండుగగా, వీనులవిందుగా ఉంటోంది. ముఖ్యంగా కేంద్రమంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కింజరపు రామ్మోహన్‌నాయుడు లాంటి యువ నాయకులు ప్రజా సమస్యల పట్ల స్పందిస్తున్న తీరు చాలా బాగుంది. వారిని చూడడానికి రెండు కళ్ళూ, వాళ్ళ మాటలు వినడానికి రెండు చెవులూ సరిపోవడంలేదు. గత అయిదేళ్ళలో మన రాష్ట్రం నుండి ఒక్క అధికార పార్టీ పార్లమెంటు సభ్యుడు కూడా ఈ స్థాయిలో పార్లమెంటులో తమ వాణి వినిపించలేకపోవడం దురదృష్టకరం.

**కే.వీ.కుమార్, బాలాజీనగర్ - నెల్లూరు.**

# సత్యపీఠం

నిజాలే మాట్లాడుకుందాం! 68

## ఆసుపత్రులు - హోటళ్ళ వ్యర్థాలతో అనర్థం

# ఆరోగ్యానికి కాటు - పర్యావరణానికి చేటు

దేశంలో కొన్ని లక్షల ఆసుపత్రులు, హోటళ్ళు నిత్యం ప్రజలకి తమ సేవలందిస్తూ వ్యాపారాలు చేస్తున్నాయి. ఆ ఆసుపత్రులు, హోటళ్ళు పాటించాల్సిన నియమ నిబంధనలని ఒక్కరు కూడా సక్రమంగా పాటించడంలేదు. కాలం చెల్లిపోయిన మందుల్ని, పాసిపోయిన ఆహార పదార్థాలని చెత్తకుప్పల్లోకో, సైడు కాలువల్లోకో, లేదంటే ఖాళీగా ఉన్న బహిరంగ ప్రదేశాల్లోకో విసిరిపారేసి చేతులు దులుపుకుంటున్నారు. ప్రధానంగా ఆసుపత్రుల చుట్టూరా పనికిరాని మందులు, రక్తంతో తడిసిన దూదిగుడ్డలు, మలమూత్రాలతో నిండిన ప్లాస్టిక్ బ్యాగ్‌లు, డైపర్లు, మాస్కులు, చేతిగ్లౌజులు కుప్పలు తిప్పలుగా కనిపిస్తుంటాయి. వీటితోపాటు వాడేసిన సూదులు–సిరంజిలు, బ్లేడ్‌లు, పదునైన పరికరాలు కూడా దర్శనమిస్తుంటాయి.

అదేవిధంగా... హోటళ్ళు, రెస్టారెంట్ల వెలుపల ఉండే మురుగుకాలువల్లో కూడా గబ్బుకొట్టిపోయిన ఆహారపదార్థాలు గుట్టలకొద్దీ పడేసుంటాయి. ఇది ఏ ఒక్కచోటో, ఒక ఊరో, ఒక ప్రాంతమో అని కాదు, దేశమంతా ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి.

### ఎక్కడ చూసినా వ్యర్థాలే

ముఖ్యంగా నగరాలు, పట్టణప్రాంతాల్లో మురికి కాలువలన్నీ కంపుకొడుతూ ఇలాంటి వ్యర్థాలతోనే నిండిపోయి ఉంటున్నాయి. అయితే, "బయట పారేశాంలే మనకిక ఏం కాదు" అనుకుంటే మురుగ్గుంటలో కాలేసినట్లే. అవన్నీ క్రమేణా నీళ్ళల్లో మగ్గి వానకు తడిచి ఎండకు ఎండి, కుళ్ళిపోయి, చీకిపోయి వాయువు రూపంలో క్రమంగా వాతావరణంలో కలసిపోతున్నాయన్న సంగతి అందరూ గ్రహించాలి. వాటి ఫలితంగా వ్యర్థాలన్నీ విషపూరితమై సమాజానికి తీరని హాని కలుగుతోందని ప్రపంచ ఆరోగ్యసంస్థతో పాటు అంతర్జాతీయ శాస్త్రవేత్తలు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చివరికి అవి మన ఆరోగ్యానికి యమపాశంలా చుట్టుకుంటున్నాయని కూడా హెచ్చరిస్తున్నారు. ఆసుపత్రుల నుంచి వెళ్ళే మురుగు కాలువల నుంచి వెలువడే వాయువులు, విషజలాలు కలసి ప్రజలకు భయంకరమైన వ్యాధులను అంటగడుతున్నాయని వాపోతున్నారు.

ప్రజలకు వైద్యసేవలు అందించే ఆసుపత్రులు, ఆకలి తీర్చే హోటళ్ళు, తినుబండారాల దుకాణాలు లేని ప్రాంతాలు ఉండవు. అవన్నీ జన జీవనంలో ఓ భాగమే, వారికి అత్యవసరమే. కానీ, వాటిద్వారా నిరంతరం వస్తున్న వ్యర్థాలను సక్రమమైన రీతిలో నిర్వీర్యం చేయకపోవడం వల్ల కలిగే అనర్థాలు మాత్రం అత్యంత ప్రమాదకరమన్న విషయం ఎవరూ గుర్తించడంలేదు.

దేశవ్యాప్తంగా నిత్యం టన్నుల కొద్దీ వచ్చిపడుతున్న ఆ వ్యర్థాల పట్ల ఇకనైనా ప్రభుత్వాలు కళ్ళు తెరవకపోతే అటు ప్రజారోగ్యానికీ, ఇటు పర్యావరణానికి కూడా ప్రమాదమేనని పలు వేదికలపైన వివిధ రంగాల నిపుణులు ఆందోళన వ్యక్తం చేయడం మనం చూస్తూనే ఉన్నాం.

### నిబంధనలున్నా.. పట్టించుకునే నాథులే లేరు

అసలే మురుగు కాలువలు. అవి ఎంత దుర్గంధభరితంగా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆ మురుగులో ఆసుపత్రుల నుంచి సైడుకాలువల ద్వారా వెలువడే ఇలాంటి విషపూరితమైన వ్యర్థాలు కలిసిపోతాయి. వైద్య పరిభాషలో వీటిని బయోమెడికల్ వ్యర్థాలు, లేదా జీవవైద్య వ్యర్థాలు అంటారు. వాటిలో ప్రాణాంతకమైన బ్యాక్టీరియాలు, పలు రకాల వైరస్‌లు ఉంటాయి. వీటివల్ల ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికులు, సాధారణ ప్రజలు అనారోగ్యానికి గురై.. ప్రాణాలు పోగొట్టుకుంటుంటారు. ప్రజారోగ్యాన్ని కాటేస్తున్న ఇలాంటి వ్యర్థాలను నివారించేందుకు, వాటిని క్రమబద్ధమైన రీతిలో నిర్వీర్యం చేసేందుకు బోలెడన్ని నియమ నిబంధనలున్నాయి. వాటిని ఎలా నిరోధించాలో చెప్పే సూచనలు, విధానాలు కూడా ఉన్నాయి. కానీ, వాటిని పట్టించుకునేవారే లేరు!

దేశంలో సుమారు నాలుగు లక్షలకు పైగానే ఆసుపత్రులున్నాయి. వీటిలో దాదాపు 90 శాతం ఆసుపత్రుల్లో ఆ వ్యర్థాలను తొలగించేందుకు తగ్గ వ్యవస్థలు, అవసరమైన సిబ్బంది లేరు, సామాగ్రి లేదు. ఫలితంగా, రోజుకు సుమారు 700 టన్నులకు పైగానే వ్యర్థాలు వస్తున్నాయని నిపుణుల అంచనా. వీటిని శుద్ధిచేసేందుకు ఆసుపత్రుల్లో సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు తప్పనిసరిగా ఉండాలి. శస్త్రచికిత్సలు చేసినప్పుడు, ప్రసవాలు జరిగినప్పుడు అధికంగా విడుదలయ్యే వ్యర్థజలాలను నేరుగా మురుగు కాలువల్లోకి వదలకుండా ఈ ప్లాంట్‌ల ద్వారా శుద్ధిచేసిన తర్వాతే బయటికి పంపాలి. కానీ, ఎక్కడా అలా జరగడంలేదు. ప్రభుత్వాలు, పాలకులు ప్రజారోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నామని ఊకదంపుడు మాటలు చెప్తున్నాయి. అంతే తప్ప ఆచరణలో ప్రజారోగ్యాన్ని పాడెక్కించేస్తున్న ఇలాంటి వ్యర్థాల పట్ల చీమకుట్టినట్లు కూడా ఉండకపోవడం విచారకరం.

ఇప్పటికైనా అటు ప్రభుత్వాలు, సంబంధిత అధికార యంత్రాంగాలు మేల్కోవాలి. ఎక్కడికక్కడ ఆ వ్యర్థాలను అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలి. లేకుంటే, మనం పనికిరానివనుకుని పారేస్తున్న వ్యర్థాలే అనర్థాలై పర్యావరణానికి చేటై మనల్ని అనారోగ్యానికి గురిచేసి మన ప్రాణాలని కాటేస్తాయి!...

తస్మాత్ జాగ్రత్త!

**- రాజశ్రీ**

# ప్రభుత్వ సహకారంతో.. విద్యార్థులు అద్భుతాలు చేస్తారు

## మంత్రి నారాయణ



ప్రభుత్వ సహకారం ఉంటే.. విద్యార్థులు అద్భుతాలు సాధిస్తారని.. వారికి ప్రోత్సాహం అందించేందుకు విద్యాశాఖా మంత్రి లోకేష్ 'తల్లితండ్రులు ఉపాధ్యాయుల సమావేశానికి' శ్రీకారం చుట్టారని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరులోని బివిఎస్ బాలికల హైస్కూల్లో ఇటీవల జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూటాన్ సౌత్ ఏషియన్ గేమ్స్‌లో ఆటియా పాటియ గేమ్‌లో విజేత.. బీవీఎస్ విద్యార్థిని పూజిత (16)ను అభినందించి సన్మానించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... రాష్ట్రంలో 45094 పాఠశాలల్లో 36లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని, దేశంలో ఇంత పెద్దఎత్తున తల్లితండ్రులు ఉపాధ్యాయులలతో సమావేశం నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు.. గత ప్రభుత్వం నాడు-నేడు పథకం పేరుతో నిధులను దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. తాను కూడా ఉపాధ్యాయునిగా పనిచేశానని, విద్యార్థుల మనస్తత్వం ఎలా ఉంటుందో తనకు తెలుసన్నారు. 1972లో పదో తరగతిలో ఉత్తీర్ణత కాలేకపోయిన తాను, ఆ తర్వాత కసితో చదివి డిగ్రీ, పీజీలో కళాశాల ఫస్ట్ క్లాస్ స్టూడెంట్‌గా మంచిపేరు తెచ్చుకున్నానని ఆయన గుర్తుచేసుకున్నారు.

# చదువుతోనే ఉదయగిరి అభివృద్ధి

## - - - ఎమ్మెల్యే కాకర్ల సురేష్ - - -



విద్యతోనే మెట్ట ప్రాంతమైన ఉదయగిరి అభివృద్ధి సాధ్యమని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ మీటింగ్ నేపథ్యంలో ఆయన ఉదయగిరి మండలం గండిపాలెం గురుకుల పాఠశాలలో ఆ సమావేశంలో పాల్గొన్నారు. తొలుత, సరస్వతి దేవి పూజ నిర్వహించారు. తల్లితండ్రులకు ఆటల పోటీలు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ, గురుకుల పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేస్తానన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబు పేటీఎం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆత్మీయ సమ్మేళనం రాష్ట్రవ్యాప్తంగా 45వేల పాఠశాలల్లో జరుగుతుండగా, జిల్లాలో 2604 పాఠశాలల్లో నిర్వహించారన్నారు. తల్లితండ్రులు, ఉపాధ్యాయుల సమిష్టి కృషితోనే పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు పడతాయన్నారు. పిల్లలంతా కష్టపడి చదువుకొని జీవిత లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఉదయగిరి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో.. జపాన్-హిరోషిమా బృందం




జపాన్‌లోని హిరోషిమా రాష్ట్రానికి చెందిన నలుగురు సభ్యుల ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం ఈనెల 9న శ్రీసిటీని సందర్శించింది. హిరోహరు సకనే నేతృత్వంలోని బృందసభ్యులకు శ్రీసిటీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్(మార్కెటింగ్) ఆర్.శివ శంకర్ స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రత్యేకతలను ప్రగతిని వివరించారు. 30కి పైగా జపనీస్ కంపెనీల స్థాపనతో భారత దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా గుర్తింపు పొందడం శ్రీసిటీ ప్రత్యేకత అని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆ ప్రతినిధుల బృందం శ్రీసిటీలోని ప్రగతిని అభినందించింది. శ్రీసిటీ పారిశ్రామిక అనుకూల వాతావరణం పట్ల బృంద సభ్యులంతా సంతోషం వ్యక్తం చేశారు. అద్భుతమైన పర్యావరణ వ్యవస్థతో నిర్మాణాత్మక పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయడంలో శ్రీసిటీ యాజమాన్యం కృషిని వారు కొనియాడారు. వారి ఈ పర్యటనపై హర్షం వ్యక్తం చేసిన శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, భారత్, జపాన్ దేశాల మధ్య వ్యాపార బంధం మరింత బలపడేందుకు ఈ పర్యటన ఒక ముఖ్యమైన ముందడుగుగా తన ప్రకటనలో పేర్కొన్నారు. హిరోషిమా వ్యాపారవేత్తలు శ్రీసిటీలో పెట్టుబడులు పెట్టేందుకు వారి పర్యటన దోహదపడుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఆ ప్రతినిధుల బృందంలో హిరోషిమా ప్రభుత్వ అధికారి యుదై హరున్, హిరోషిమా బ్యాంక్ లిమిటెడ్‌కి చెందిన తకుషి కొసాకా, హిరోకి ఒనిషి తదితరులు పాల్గొన్నారు.

## విఆర్‌సి విశ్రాంత లెక్చరర్..

# మధుసూదన్‌రెడ్డి కన్నుమూత



నెల్లూరు విఆర్ కళాశాలలో జువాలజీ లెక్చరర్‌గా పనిచేసి రిటైరైన మన్నే మధుసూదన్‌రెడ్డి డిసెంబరు 6న అనారోగ్యంతో కన్నుమూశారు. రామలింగాపురంలోని తమ నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. 1945లో జన్మించిన మధుసూదన్‌రెడ్డి, 1971లో విఆర్ కాలేజీలో డెమాన్‌స్ట్రేటర్‌గా ఉద్యోగంలో చేరి, ఆ తర్వాత పట్టుదలగా చదువుకుని, జువాలజీలో ఎమ్మెస్సీ పూర్తిచేసి, విఆర్‌సిలోనే అధ్యాపకునిగా ఉద్యోగోన్నతి పొందారు. జువాలజీ బోధనలో ప్రావీణ్యం సాధించి, ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆయన మృతికి పలువురు అధ్యాపకులు, ఆయనవద్ద చదువుకున్న విద్యార్థులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## లోకేష్ సారథ్యంలో..

# విద్యారంగంలో విశేష మార్పులు

## - మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిద్దడానికి తమ కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రత్యేకించి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబు సారథ్యంలో విద్యారంగంలో విశేష మార్పులు వస్తుండడం సంతోషకరమని మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొనియాడారు. ప్రభుత్వం ఇస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని చిన్నారులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. వెంకటాచలం మండలం సర్వేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన తల్లితండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.29,990 కోట్లు కేటాయించి విద్యార్థుల భవితకు ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. విద్యార్థుల్లో చిన్నతనం నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ కోసం అందులో రూ.1.48 కోట్లు కేటాయింపు జరగడం హర్షణీయమన్నారు.

### 'నాడు-నేడు' పేరుతో బిల్లులు చేసుకున్నారు :

గత ప్రభుత్వ పాలనలో ఏ పథకానికి చూసినా, ఎక్కడబట్టినా జగన్ పేరు, ఫొటోలే కనిపించేవని, ఆ విధానానికి తమ ప్రభుత్వం స్వస్తి పలుకుతూ రాష్ట్ర, జాతీయస్థాయిలో వివిధ రంగాల్లో సేవలందించిన వారి పేర్లు పెడుతోందన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సమాజ సేవకురాలు డొక్కా సీతమ్మ పేరు పెట్టారన్నారు. గత ప్రభుత్వం నాడు-నేడు పథకం పేరుతో స్కూళ్లలో రేపు అనేది లేకుండా చేసిందని ఆయన విమర్శించారు. సర్వేపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు తాము కృషి చేస్తామని, పాఠశాల క్రీడామైదానం అభివృద్ధి, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనకు వేదిక నిర్మాణం కూడా త్వరలోనే చేపడతామన్నారు.

## ఏఎస్‌పేట దర్గాలో.. పోలంరెడ్డి



తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకుల ఆహ్వానం మేరకు అనుమసముద్రంపేట (ఏఎస్‌పేట)లో ఉన్న పవిత్రమైన నాయబ్ రసూల్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాల్లో పాల్గొన్న టీడీపీ నాయకుడు, రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి.

# శబరి శ్రీరామక్షేత్రంలో..13న హనుమద్వ్రతం

## - అదేరోజున శ్రీరామకోటి గ్రంథాల నిక్షిప్తం -

ఈనెల 13వ తేదీ శుక్రవారం హనుమద్వ్రతం సందర్భంగా నెల్లూరులోని శబరి శ్రీరామక్షేత్రంలో వైభవంగా పూజలు, శ్రీరామకోటి గ్రంథాలను నిక్షిప్తం చేయడం కోసం భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయంలో కొలువైవున్న శ్రీ సీతారాములకు, శ్రీ ఆంజనేయ స్వామివారికి ఆలయ అర్చకులు విశేష పూజలు చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు అఖిలభారత హనుమాన్ దీక్షా పీఠం (విజయవాడ)వారి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా అఖండపారాయణం జరిగింది. 13వతేదీ హనుమద్వ్రతం కనుక, ఆరోజు ఉదయం 6 గంటలకు శ్రీ ఆంజనేయస్వామివారికి అభిషేకం, 9 గంటలకు హనుమత్‌గాయత్రి హోమం, 10 గంటలకు లక్ష నాగవల్లీ దళార్చన, 11.30 గంటలకు పూర్ణాహుతి నిర్వహిస్తారు. అనంతరం, మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవం ప్రారంభమవుతుంది. వేదపండితుల వేదమంత్రోచ్ఛటనలు, మంగళ వాయిద్యాలు, భక్తుల శ్రీరామ నామోచ్చారణల మధ్య సాయంత్రం 4 గంటలకు శ్రీ రామకోటి గ్రంథాల ఊరేగింపు కన్నులపండువగా నిర్వహించనున్నారు. ఆ తర్వాత, భక్తులు రాసిన శ్రీరామకోటి పుస్తకాలను ఆలయం సమీపంలో ఉన్న శ్రీరామకోటి స్థూపంలో నిక్షిప్తం చేయనున్నారు. ఈ వేడుకలకు భక్తులందరూ తరలివచ్చి స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరుతున్నారు.

# సిద్ధార్థ హాస్పిటల్స్ ప్రారంభం



నెల్లూరు మినీ బైపాస్ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన 'సిద్ధార్థ ఎండోక్రైన్ అండ్ డెర్మటాలజీ హాస్పిటల్'ను ఈనెల 8వ తేదీన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానాల పాలక మండలి సభ్యురాలు.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ప్రారంభించారు. టీడీపీ సీనియర్ నాయకులు.. ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు జెడ్.శివప్రసాద్, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డిల సహకారంతో నెల్లూరు నగరంలో ఒక మంచి ఆసుపత్రిని ఏర్పాటు చేశారంటూ ఆసుపత్రి యాజమాన్యాన్ని వేమిరెడ్డి దంపతులు అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్లు సిద్ధు నిఖిత్, ప్రీతిరెడ్డిలను వారు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ బి.ప్రసన్న, మేడా వాణి, ఎం. చంద్రశేఖర్‌రెడ్డి, ఉషా మాధవి, పెళ్లకూరు రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డా.బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి



నెల్లూరులోని 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఇటీవల రాజ్యాంగనిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కెవిఆర్ నగర పాలక ఉన్నత పాఠశాల ఎన్‌సిసి కేడెట్లు నగరంలోని వీఆర్ కళాశాల కూడలిలో డా. బి.ఆర్.అంబేద్కర్ కాంశ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ డా. బి.ఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించి జాతికి తన జీవితాన్ని అంకితం చేశారని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులంతా ఆ మహనీయుని స్ఫూర్తితో రాణించాలని చెప్పారు.

# ప్రీ-క్రిస్మస్ వేడుకలు

నెల్లూరులోని వీఆర్‌సి మైదానంలో ఈనెల 10వ తేదీ రాత్రి ప్రీ-క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. సింహపురి ఐక్య క్రిస్మస్ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ సువార్తికుడు బ్రదర్ అనిల్‌కుమార్ లైవ్ ద్వారా ప్రసంగించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేశారు. క్రిస్మస్ ట్రీని ఆవిష్కరించారు. నెల్లూరు బిషప్ ఎం.డి ప్రకాశం, సింహపురి ఐక్యవేదిక వ్యవస్థాపకుడు బర్నబాసు, జిల్లా పాస్టర్ల ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి డేవిడ్ దయాసాగర్, క్రైస్తవ నాయకులు ఊరందూరు సురేంద్రబాబు, సాల్వేషన్ ఆర్మీ మేజర్ ఏసురాజ్యం, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు హనోక్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# ప్రమాదాలు జరగకుండా చూడాలి

- **రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్**



జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రోడ్డు భద్రత చర్యలు సకాలంలో చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఇటీవల కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన రోడ్డు భద్రత కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను ఉప రవాణా కమిషనర్(డీటీసీ) చందర్ వివరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలను అన్ని కళాశాలలు, హైస్కూళ్ళలో చేపడుతున్నామని ఆయన వివరించారు. గత సమావేశంలో కలెక్టర్ ఆదేశాల మేరకు తీసుకున్న నిర్ణయాలను అమలుచేశామని, మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయని డీటీసీ తెలిపారు. రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తప్పకుండా అమలుచేయాలని కలెక్టర్ ఈ సమావేశంలో ఆదేశించారు. నెల్లూరు నగరంలో సిగ్నల్ పాయింట్లను త్వరగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గొలగమూడి జంక్షన్ వద్ద లైటింగ్ మరింత పెంచాలని సూచించారు. జాతీయరహదారిపై ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్ డీజీఎం గోవర్ధన్, ఎన్ హెచ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంకే చౌదరి, ఏఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ ఓబులేసు నందన్ తదితరులు పాల్గొన్నారు.

# కళాంజలి అనంత్ ప్రతిభ

- **'షీ' షార్ట్‌ఫిల్మ్‌కు..2 అవార్డులు**


అనంత్


సంగీత్‌సౌరభ్

నెల్లూరులోని కళాంజలి సాంస్కృతిక సంస్థ నిర్వాహకుడు, ప్రముఖ నటుడు, దర్శకుడు కళాంజలి అనంత్ తన ప్రతిభా పాటవాలను మరోసారి నిరూపించుకున్నారు. ఆయన ఇటీవల సందేశాత్మకంగా రూపొందించిన 'షీ' షార్ట్ ఫిల్మ్‌కు రెండు అవార్డులు రావడం విశేషం. హైదరాబాద్‌లోని వి.వరల్డ్ టైగర్ అవార్డ్స్ వారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఇటీవల షార్ట్‌ఫిల్మ్ పోటీలు నిర్వహించారు. రెండు రాష్ట్రాల నుండి సుమారు 100 షార్ట్‌ఫిలిమ్స్ ఈ పోటీలకు వచ్చాయి. వాటిలో కళాంజలి అనంత్ కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించిన 'షీ' ద పవర్.. షార్ట్‌ఫిల్మ్‌కు ఉత్తమ జ్యూరీ అవార్డ్‌తో పాటు, సంగీత దర్శకత్వం వహించిన సంగీత్‌సౌరభ్‌కి బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ అవార్డ్ లభించింది. ఈ షార్ట్ ఫిల్మ్‌లో ప్రముఖ నటీనటులు రామచంద్రమూర్తి, దువ్వూరు బెనర్జీ, మౌనిక, ఉపేంద్ర, శివకుమార్, హజరత్ నటించగా క్రిస్టోఫర్ కెమెరామెన్‌గా వ్యవహరించారు. డిసెంబరు 6న హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ప్రముఖ సినీనటులు బోసుబాబు, జగదేశ్వరి, 'వారాలబ్బాయి' సీరియల్ దర్శకులు సుందర్ పాల్గొన్నారు.

### చేవూరు ఆధ్వర్యంలో..

# సోనియా జన్మదిన వేడుకలు



కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ 77వ జన్మదిన వేడుకలు ఇటీవల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌నగరంలో జరిగిన ఈ వేడుకల్లో తొలుత కేకు కట్‌చేసి అందరికీ పంచారు. మహిళలకు చీరలు, వృద్ధులకు పండ్లు పంచిపెట్టారు. దేశం కోసం కుటుంబాన్ని త్యాగం చేసిన వీరవనిత సోనియాగాంధీ అంటూ చేవూరు ఈ సందర్భంగా కొనియాడారు. సోనియాగాంధీతో పాటు, ఆమె కుమారుడు రాహుల్‌గాంధీ, ప్రియాంక.. వీరి కుటుంబమంతా దేశం కోసం నిరంతర శ్రమించే కుటుంబంగా ప్రసిద్ధికెక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావు యాదవ్, నాయకులు ఫయాజ్, ఇ.మల్లికార్జున్‌రెడ్డి, మైనారిటీ విభాగం అధ్యక్షుడు అల్లావుద్దీన్, మండల అధ్యక్షుడు షేక్ హుస్సేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణచైతన్యలో ఉత్సాహంగా క్రీడలు



నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నెల్లూరులోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో జరుగుతున్న గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా మూడవరోజున కృష్ణచైతన్య విద్యా సంస్థల సారథులు డా.ఆర్‌వి కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ పర్వతరెడ్డి రాణా ప్రమోద్‌రెడ్డిలు కలిసి క్రీడాజ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ కళాశాల విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు మానసిక ప్రశాంతతతో పాటు, శారీరక దృఢత్వం అలవడుతుందన్నారు. ఈ క్రీడల్లో సుమారు 3వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొని పోటాపోటీగా ఆడారు. కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, చెస్, క్యారమ్స్ మొదలగు క్రీడల్లో విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడల్లో బాగా రాణిస్తున్న తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడలకు కూడా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కళాశాల డీన్‌లు రామాంజనేయులురెడ్డి, సుధారాణి, రామ్‌గోపాల్ రెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయం ఛైర్మెన్...

# రత్నం జయరామ్..అస్తమయం



నెల్లూరులోని ప్రముఖ దేవాలయం.. దర్గామిట్టలో వెలసివున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయం వ్యవస్థాపక ఛైర్మెన్ రత్నం జయరామ్ (78) ఈనెల 10వతేదీ మంగళవారం సాయంత్రం కన్నుమూశారు. గుండె జబ్బుతో బాధపడుతూ తన నివాసంలోనే తుది శ్వాస విడిచారు. శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వ్యవస్థాపకులైన రత్నం మొదలియార్ కుమారుడే ఈయన. పీడబ్ల్యుడీలో చేస్తున్న ఉద్యోగం నుంచి రిటైరయ్యాక, 2006 నుంచి ఆలయ ఛైర్మెన్‌గా వ్యవహరిస్తూ ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. రత్నం జయరామ్ మృతికి ఆలయ ఇఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, సిబ్బంది సంతాపం ప్రకటించారు. ఆయన మృతికి సంతాపసూచకంగా ఆలయాన్ని బుధవారం మధ్యాహ్నం వరకు మూసివేశారు.




### కొండాయపాలెం స్కూల్‌లో

# తల్లితండ్రుల సమావేశం

నెల్లూరులోని కొండాయపాలెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ఇటీవల తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా 20వ డివిజన్ కార్పొరేటర్ చేజర్ల మహేష్‌బాబు పాల్గొని మాట్లాడుతూ పిల్లల ప్రగతి గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత తల్లితండ్రులదేనన్నారు. తల్లితండ్రులకు ముగ్గులు మరియు మ్యూజికల్ ఛైర్స్ పోటీలు నిర్వహించారు. గెలుపొందినవారికి బహుమతులందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్‌రావు, ఎస్‌ఎంసి ఛైర్‌పర్సన్ శిరీష, మల్లి, డేవిడ్, దాతలు పాల్గొన్నారు.

# జిల్లాలోని రైల్వే సమస్యలు తీర్చండి

## కేంద్ర రైల్వేమంత్రిని కోరిన..ఎంపీ వేమిరెడ్డి



నెల్లూరుజిల్లాలో రైల్వే పరంగా ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలంటూ నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్వని వైష్ణవ్‌ను కోరారు. ఈనెల 10న ఆయన ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి పలు సమస్యలను చర్చించారు. జిల్లాలో లెవెల్ క్రాసింగ్‌లను తొలగించడంలో భాగంగా, కావలి యార్డ్, వేదాయపాళెం, అల్లూరు రోడ్డు, వెంకటాచలం, గూడూరు, పడుగుపాడు, తెట్టు-ఉలవపాడు, వెంకటేశ్వర పాళెం మొదలైన వాటిలో 11 లెవెల్ క్రాసింగ్ లను రైల్వే శాఖ గుర్తించిందని తెలిపారు. వీటిపై ఆర్వోబి, ఆర్‌యూబిలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, కావలి యార్డు, తెట్టు-ఉలవపాడులో పనులు నత్తనడకన సాగుతుండగా, మరికొన్ని నిర్మాణ దశకు చేరుకో లేదని వివరించారు.

### బిట్రగుంట అభివృద్ధిపై దృష్టి పెట్టండి...

నెల్లూరు జిల్లాలో దాదాపు 700 ఎకరాల్లో ఉన్న బిట్రగుంట రైల్వేస్టేషన్ అభివృద్ధిపై దృష్టి సారించాల్సి ఉందని ఆయన ఈ సందర్భంగా కేంద్రమంత్రికి తెలిపారు. ప్రస్తుతం 420 ఎకరాల భూమి ఖాళీగా ఉందన్నారు. అన్ని వసతులు ఉన్న బిట్రగుంట ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే రైల్వే పరంగా ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. కృష్ణపట్నం ఓడరేవు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం ఓడరేవు బిట్రగుంట నుంచి 20- 45 కి.మీ.ల దూరంలోనే ఉన్నాయన్నారు. అలాగే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సంబంధించి ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ యూనిట్‌ను బిట్రగుంటలో ఏర్పాటు చేయవచ్చని కూడా చెప్పారు.

### నడికుడి-శ్రీకాళహస్తి పనులు వేగవంతం చేయండి..

రూ.2,333 కోట్ల బడ్జెట్‌తో 309 కిలోమీటర్ల పొడవున ఏర్పాటు కానున్న నడికుడి-శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైను పనులు నత్తనడకన సాగుతున్నాయని, ఆ పనులను వేగవంతం చేయాలని ఎంపీ వేమిరెడ్డి కేంద్రమంత్రిని కోరారు. ఇప్పటివరకు కొత్త పిడుగురాళ్ల నుంచి శావల్యాపురం, గుండ్లకమ్మ-దర్శి మధ్య, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ మధ్య కేవలం 74 కిలోమీటర్ల మేర పనులు మాత్రమే పూర్తయ్యాయన్నారు. 235 కిలోమీటర్ల పొడవున బ్యాలెన్స్ లైన్ వేయాల్సి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చెన్నై-కోల్‌కత్తా రైల్వే లైన్‌కి ప్రత్యామ్నాయంగా ఈ రైల్వేలైన్ ఉపయోగపడుతుందని ఆయన కేంద్రమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

# 24 గంటల్లోనే భవనాలకు అనుమతులు

## • రాష్ట్ర పురపాలక మంత్రి డా. నారాయణ



బిల్డింగ్ అనుమతులకు అవసరమైన అన్ని పత్రాలు సమర్పిస్తే కేవలం 24 గంటల్లో అనుమతులు ఇచ్చే నూతన విధానాన్ని తీసుకువస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు నగరపాలక సంస్థ కార్యకలాపాలపై కమిషనర్ సూర్య తేజతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం, మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ, వివిధ లే-అవుట్‌లలో పార్కుల కోసం కేటాయించిన భూమిని కచ్చితంగా పార్కుల కోసమే వినియోగించాలన్నారు. నెల్లూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నగరంలోని పార్కులను సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. అయితే ప్రజలు కూడా రెవిన్యూ బకాయిలు చెల్లించి, నగరాభివృద్ధికి సహకరించాలన్నారు. ఇప్పటికే నాలుగు నెలల కాలంలో ఆరున్నర కోట్ల రెవిన్యూ బకాయిలను ప్రజలు చెల్లించారని, వారిని ఆదర్శంగా తీసుకొని మిగతావారు కూడా పెండింగ్‌లో ఉన్న 120 కోట్ల బకాయిలను చెల్లించాలని సూచించారు. నెల్లూరు నగరంలో పుట్టి, దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన నెల్లూరువాసులు నగరంలో అభివృద్ధి చేసిన పార్కులను దత్తత తీసుకుని వాటి నిర్వహణ చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# విఎస్‌యూలో రక్తదానం

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ నాలుగో యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 10న రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం మంచి సేవా కార్యక్రమమని, రక్తదాన మంటే బాధితులకు ప్రాణదానం చేయడమేనని విఎస్‌యూ ఉపకులపతి ఆచార్య విజయభాస్కర్‌రావు ఈ సందర్భంగా అన్నారు. దాదాపు 60మంది విద్యార్థులు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

# హోంగార్డ్స్‌కి.. కొత్త డీఎస్పీ వచ్చారు



జిల్లా హోంగార్డ్స్ విభాగానికి కొత్త డీఎస్పీ వచ్చారు. మంగళగిరిలో ఆక్టోపస్ విభాగంలో పనిచేస్తున్న ఎన్.వెంకటరమణ నెల్లూరులో ఇటీవల కొత్త డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. 1991లో ఆర్ఎస్ఐగా పోలీసు శాఖలో చేరిన వెంకటరమణ, ఆ తర్వాత ఆర్ఐగా పలు ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. డీఎస్పీగా హైదరాబాద్, విశాఖల్లో కూడా పనిచేశారు. కొత్త డీఎస్పీకి 'లాయర్' శుభాకాంక్షలు.

# ఇరుకళలమ్మవారి ఆలయంలో..

## రాహుకాల దీపారాధన



నెల్లూరు మూలాపేటలో చెరువు గట్టున వెలసివున్న కరుణామయి.. శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈనెల 9న మహిళాభక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని రాహుకాల దీపారాధనలు చేశారు. తొలుత ఆలయంలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేకపూజలు చేసి, భక్తి శ్రద్ధలతో శ్రీ దుర్గా సహస్రనామ పూజలను నిర్వహించారు. ఆలయ ఇఒ వి.గిరికృష్ణ, ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఒట్టూరు నరేంద్రయాదవ్, సభ్యులు చంద్రశేఖరస్వామి ఈ పూజలను పర్యవేక్షించారు.

# గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తా!

## • కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



తమ నియోజకవర్గంలోని గిరిజనులకు అండగా ఉంటూ, వారి సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హామీ ఇచ్చారు. విడవలూరు మండలం పార్లపల్లి గ్రామంలో ఇటీవల ఏఆర్‌డీ స్వచ్ఛంధ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేసి గిరిజనులకు ఆర్థిక చేయూతనిచ్చి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని తెలిపారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి వున్న గిరిజన బిడ్డలకు నాణ్యమైన విద్య అందించేందుకు కోవూరు నియోజక వర్గంలోని ప్రతి మండలంలో గురుకుల పాఠశాల నిర్మాణానికి ప్రయత్నం చేస్తామని ఆమె అన్నారు. అర్హులైన గిరిజనులకు ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మించి ఇస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గిరిజనుల అభ్యున్నతికి అహరహం కృషి చేస్తున్నారని తెలిపారు. చాలామంది గిరిజనులకు ఆధార్ కార్డులు లేకపోవడం, మరికొందరి ఆధార్ కార్డుల్లో తప్పిదాల కారణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోలేక పోతున్నారన్నారు. ఇప్పటికే ఇందుకూరుపేటలో ఆధార్ కార్డులకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ ద్వారా గిరిజన బిడ్డలకు 600 మందికి పైగా ఆధార్ కార్డులు మరియు బర్త్ సర్టిఫికేట్లు అందచేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండలంలో నిర్వహించే ప్రత్యేక ఆధార్ డ్రైవ్‌ను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. గిరిజన సమస్యల పట్ల స్థానిక టిడిపి నాయకులు చొరవ చూపాలన్నారు. మండలాధ్యక్షురాలి స్థాయికి ఎదిగిన కోవూరు మాజీ ఎంపీపీ యాకసిరి రమణమ్మను ఆదర్శంగా తీసుకొని గిరిజనులు రాజకీయ చైతన్యం పొందాలన్నారు. అనంతరం ఏఆర్‌డి స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

### ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

కోవూరు నియోజకవర్గానికి చెందిన పలువురు అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆర్థిక సాయంగా చెక్కులు మంజూరయ్యాయి. వాటిని ఇటీవల నెల్లూరు మాగుంట లే-అవుట్‌లోని తమ నివాసంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కోవూరు మండలం పాటూరుకు చెందిన మట్టెం కృష్ణయ్యకు 1,62,000 రూపాయలు, ఇందుకూరుపేట కొత్తూరు నివాసి పూనమల్లి వెంకటరమణయ్యకు రూ.1,03,327, లేగుంటపాడుకు ఎస్. సుబ్బమ్మకు రూ. 81,000, బుచ్చి మండలం దామరమడుగు నివాసి ఏటూరికి రూ. 1,42,290, ఇందుకూరుపేట మండలం మైపాడు గ్రామానికి చెందిన పల్లికొండ శ్రీనివాసులుకు రూ. 1,19,386, బండి సందీప్‌కు రూ. 1,64,733, బుచ్చి మండలం పెనుబల్లి గ్రామస్తుడు భాస్కర్‌రెడ్డికి రూ. 84,000, మొత్తం 8,56,773 రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. తమకు సాయం అందించిన సీఎం చంద్రబాబుకు, సహకరించిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



## జానకిరామ.. రామాయణం 43

- ఊటుకూరు జానకి రామారావు



నీకు, నీ సైన్యానికి సరిపడునంత దుంపలు, పండ్లు, పచ్చి మాంసం, ఎండుమాంసం ఉంది!

నీ సైన్యం సుఖంగా నేటిరాత్రికి భుజించి, విశ్రమించి రేపు బయలుదేరవచ్చును అని వినయంగా పలికాడు గుహుడు.

నా రాముని మిత్రుడా! ఇంత సేనకు నీవు ఒక్కడవే ఆతిథ్యమివ్వాలనుకొనే నీ మనస్సు ఎంతగొప్పది!

మాకు ఒకటే కోరిక! ఈ గంగ దాటి భరద్వాజ ఆశ్రమానికి వెళ్ళాలి, మేమంతా సుఖంగా గంగదాటే మార్గం చూపించు అని భరతుడు కోరాడు.

అదెంత పని, మేమంతా నీ వెంట వచ్చి దాటించగలం, కానీ నాకొక సందేహముంది, ఇంత సేనతో నీవెందుకు బయలుదేరావు?

రామునికి కీడు తలపెట్టే ఉద్దేశ్యమేమీ లేదుకదా!

అతని మాటలు విన్న భరతుడు, రాముడికి కీడు తలపెట్టే దుష్కాలం ఎన్నడునూ రాకుండు గాక. రాముడు నాకు తండ్రి వంటి వాడు! (భ్రాతా! జ్యేష్ఠః పితృసమో).

వనంలో నివసిస్తున్న రాముని వెనుకకు తీసుకొని వచ్చుటకే వెళుతున్నాను.

గుహుడా!! మరొక విధంగా తలపకు. ఇది సత్యం!.

భరతుడి మాటలువిన్న గుహుడి ముఖం వికసించింది.

ఆహా! అప్రయత్నంగా లభించిన రాజ్యలక్ష్మిని తృణప్రాయంగా విడిచిపెట్టే నీవంటివాడు నాకీ లోకంలో ఎవ్వరూ కనపడలేదు. నీ కీర్తి లోకంలో శాశ్వతంగా వ్యాపించగలదు అని ప్రశంసించాడు.

ఇంతలో రాత్రి అయ్యింది. అందరూ విశ్రమించారు.

రాముడి గురించిన ఆలోచనలతో భరతుడికి దుఃఖం చుట్టుముట్టింది. ఆ దుఃఖం కార్చిచ్చుయి కాల్చివేయసాగింది. అన్ని అవయవాలనుండీ ధారాపాతంగా చెమట కారటం మొదలుపెట్టింది.

ఆయన దుఃఖమే ఒక మహా పర్వతం.

ఆయన ఆలోచనలే ఆ పర్వతమందలి శిలలు.

ఆయన నిట్టూర్పులు ధాతువులు.

ఆయన దైన్యమే ఆ పర్వతమందలి వృక్ష సముదాయం.

ఆయనకు కలిగే శోకం, ఆయాసం, మనస్తాపం, దాని శిఖరాలు.

ఆయనకు కలిగిన మోహం అనంతమైన జంతుసముదాయం.

ఆయనకు కలిగిన సంతాపం దానిమీదున్న వెదురుపొదలు.

ఏమి చేయాలో తోచటం లేదు భరతుడికి.

నిదురరాదు! కనులు మూత పడటం లేదు.

దుఃఖం! దుఃఖం... ఒకటే దుఃఖం.

మనశ్శాంతి కరవై అల్లల్లాడిపోతున్న భరతుడిని గుహుడు ఆ రాత్రి అంతా ఓదారుస్తునే ఉన్నాడు.

రామలక్ష్మణులను తాను కలిసినదిమొదలు వారితో కలిసి గడిపిన సమయాన్ని, లక్ష్మణుడి మనోవేదనను, ఆ రాత్రి తాను, లక్ష్మణుడు ముచ్చటించుకున్న సంగతులన్నీ పూసగుచ్చినట్లు చెప్పి, చివరగా వారిని తాను గంగదాటించిన విషయాన్ని కూడా ఎరుకపరచాడు గుహుడు.

ఈ సంగతులన్నీ విన్న భరతుని హృదయంలో శోకం పెల్లుబికి కట్టలు తెంచుకొని ప్రవహించింది. కొరడాలతో కొట్టినప్పుడు ఒక్కసారే కూలబడే ఏనుగులాగ కూలపడిపోయాడాయన. భరతుడి స్థితి చూస్తున్న శత్రుఘ్నుడు కూడా శోకంతో పట్టుదప్పినిలువలేక నేలపైబడిన భరతుని కౌగలించుకొని బిగ్గరగా ఏడ్చాడు.

ఈ శోకాలు విన్న తల్లులు ముగ్గురూ భరతుని వద్దకు వచ్చిచేరగా కౌసల్యామాత తన దుఃఖం ఆపుకోలేక తానూ నేలపైపడి భరతుని కౌగలించుకొని ఏడ్వసాగింది.

ఆవిడ తీవ్రమైన బాధతో భరతుని ఉద్దేశించి నాయనా ఇంకనీవు ఏడువకురా, మొత్తం రాజవంశం అంతా నీమీదనే ఆధారపడి ఉంది. నీకేమైనా అయితే మేమెవ్వరం తట్టుకోలేము.

దశరథమహారాజు లేదు, రామలక్ష్మణులు చెంతలేరు, నిన్ను చూసుకొని బ్రతుకుతున్నాంరా తండ్రీ, నాయనా ఎందుకీ దుఃఖం? సీతారామలక్ష్మణుల గూర్చి ఏ విధమైన అప్రియమైన వార్త నీవు వినలేదు కదా!. అని పలుకుతూ తనను ఓదారుస్తున్న పెద్దతల్లి మాటలకు కాస్త తెప్పరిల్లి ఏడుస్తూనే గుహుడితో మరలమరల సీతారామలక్ష్మణుల గూర్చి ప్రశ్నించాడు. వారు ఎక్కడ ఉన్నారు? ఏమి తిన్నారు? ఎక్కడ నిదురించారు? ఇలాంటి విషయాలు పదేపదే అడిగి తెలుసుకుంటున్నాడు భరతుడు.



అప్పుడు రాముడు నిదురించిన చెట్టు వద్దకు తీసుకెళ్ళాడు గుహుడు.

రాముడు అక్కడనే దర్భలమీద శయనించాడన్న సంగతి తెలుసుకొని మరల ఆయనలో దుఃఖం పొంగిపొర్లింది.

దశరథ కుమారుడైన రాముడే నేలపై పడుకోవలసి వచ్చిందంటే కాలం కంటే బలమైన వాడెవడూ లేడని తెలుస్తుంది.

*న నూనం దైవతం కించిత్ కాలేన బలవత్తరమ్*

*యత్ర దాశరథీ రామో భూమావేవ శయీత సః.*

ఇదిగో ఇది నా అన్నగారు పరుండిన చోటు, ఇదిగో ఈ గడ్డి అంతా ఆయన శరీరపు రాపిడికి నలిగిపోయింది.

ఇదిగో ఈ దర్భలమీద ఇంకా బంగారపు పొడులు అంటుకొనే ఉన్నాయి. మా వదిన గారు అలంకారాలేవీ తీయకుండగనే శయనించినట్లుంది.

ఆవిడ ఏమాత్రం దుఃఖించకుండగనే నా అన్నవెంట వెళ్ళింది. అత్యంత సుకుమారి, పతివ్రతా శిరోమణి ఆమె!

ఈ కష్టాలు ఏవీ లెక్కపెట్టినట్లులేదు, భర్త ఉన్న చోటే తనకూ సుఖకరమైనది అనుకొంటుంది.

అయ్యో ఎంత కష్టం వచ్చింది, నేనెంత క్రూరుడను, నావలన భార్యాసహితుడై రాముడు అనాధవలే ఇట్లాంటి పడకలపై నిదురించవలసి వచ్చిందికదా! అని మరల ఏడ్వసాగాడు భరతుడు.

ఇందీవరశ్యాముడు! సార్వభౌమకుల సంజాతుడు, సర్వలోకప్రియుడు, ప్రియదర్శనుడు, అసలు దుఃఖానికి అర్హుడే కాని రాఘవుడు అన్నిసుఖాలు పరిత్యజించి నేలపైపడుకొన్నాడు కదా!

లక్ష్మణుడు ధన్యుడు ఈ సమయంలో ఆయన వెంట ఉన్నాడు.

రాముడు అరణ్యంలో ఉన్నా ఆయన బాహుబలమే అయోధ్యకు రక్ష! అందుచేతనే ఎవ్వరికీ దీనిని ఆక్రమించాలనే ఆలోచన రాదు. ఈనాడు అయోధ్యా ప్రాకారానికి రక్షణ లేదు, చతురంగబలాలలో యుద్ధసన్నద్ధతలేదు, పట్టణ ద్వారాలన్నీ తెరచే ఉన్నాయి.. అయినా ఒక్కడికి కూడా అయోధ్యను కన్నెత్తి చూసే ధైర్యం లేదు అంటే.. అది రాముడి శౌర్యప్రతాపాలవల్లకాక మరిదేనివల్లనూ కాదు.

రాముడు నారచీరలు ధరించి అరణ్యంలో ఉంటే.. నాకు ఈ పట్టువస్త్రాలెందుకు.. నేను కూడా జటలు, నారచీరలు ధరించి, కందమూలాలు తింటూ, నేలపై నేటినుండి శయనింతును గాక అని తీర్మానించుకొన్నాడు భరతుడు.

ఆ రాత్రి గంగా తీరమందే నివసించి మరునాడు తెలవారుతుండగనే శత్రుఘ్నుని లేపి ఇంకా నిదురపోతున్నావేమి త్వరగా గుహుని పిలుచుకొని రా అని తొందరచేశాడు.

అప్పుడు శత్రుఘ్నుడు భరతునితో అన్నా, అన్న రామన్న అడవులలో ఉంటే నాకు నిదుర ఎలా పడుతుంది? నా మనస్సు నిండా రామన్న ఆలోచనలే.. నేను మేల్కొనే ఉన్నాను! నీ ఆజ్ఞ కోసమే ఎదురు చూస్తున్నాను.

అదే సమయానికి గుహుడు వచ్చి భరతుడి ఎదురుగా నిలుచొని వారిని కుశలప్రశ్నలు వేశాడు.

భరతుడికి సమయం గడుస్తున్నకొద్దీ తొందర హెచ్చవుతోంది, గుహుడిని త్వరగా నది దాటించమని కోరాడు.

భరతుడి తొందర గమనించాడు గుహుడు. వెంటనే తన నగరులోకి వెళ్ళి వందలకొద్దీ పడవలను నౌకలను సన్నద్ధం చేశాడు.

బయలు దేరటానికి భరతుని ఆజ్ఞ అయ్యిందని తెలుసుకొన్న కొందరు నదిలో దూకి ఈతకొడుతూ బయలుదేరారు, కొందరు అప్పటికే తయారుచేసుకొన్న తెప్పలు నదిలో దించారు. కొందరు కడవల సహాయంతో నీటిలో తేలుకుంటూ వెళ్ళారు.

గుహుడు తెప్పించిన నావలన్నీ శ్రేష్ఠమైనవి. వాటిపేర్లు స్వస్తికములు! అత్యంత దృఢమైన నావలవి.

అందరూ నావలెక్కారు, కొన్నింటి యందు రథ, గజ, తురగాలు ఎక్కించారు, కొన్ని నావలలో జనమంతా ఎక్కి నిల్చున్నారు, కొన్నిటి యందు దశరథాంతఃపురవాసులు ఎక్కారు.

.. (సశేషం)

# సిరియా పయనమెటు?

పశ్చిమాసియా మరోసారి వార్తల్లోకి ఎక్కింది. దాదాపు రెండున్నర దశాబ్దాలు సిరియాను ఏలిన బషర్ అల్ అసద్ అనూహ్యంగా దేశం విడిచి పారిపోయారు. ఆ దేశచరిత్రలోనే ఇది కీలక మలుపు. అసద్ నిష్క్రమణతో మెజారిటీ ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు. అదే సమయంలో సిరియా భవిష్యత్తుపైనా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాజధాని డమాస్కస్‌ను ఇస్లామిస్ట్ తిరుగుబాటుదారులు తమ అధీనంలోకి తీసుకున్న నేపథ్యంలో, అసద్ రష్యాకు రాజకీయ శరణార్థిగా పారిపోవడం సంచలనమే. ఈ నేపథ్యంలో భారత్ చేసిన కీలక ప్రకటనలో ఆ దేశ ఉనికి మొత్తం అర్థమవుతుంది. 'దేశ ఐక్యత, సార్వభౌమత్వాన్ని, సిరియా ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడానికి అన్నిపక్షాలు పనిచేయాల్సిన అవసరం ఉంది. సిరియా సమాజంలోని అన్ని వర్గాలవారి ఆకాంక్షలు, ప్రయోజనాలను గౌరవించేలా సిరియా నేతృత్వంలోని శాంతియుత రాజకీయ ప్రక్రియ ఉండాలి'.. అని భారత విదేశీ వ్యవహారాల శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇది చాలా అర్థవంతమైన, అక్కడి రాజకీయ ప్రక్రియలో భాగస్వాములవుతున్న అన్ని సిరియా పక్షాలు బాగా గమనించాల్సిన ప్రకటన ఇది. సిరియా తన సార్వభౌమత్వంలో రాజీపడకూడదు, దేశమంతా ఐక్యంగా ఉండాలి, విదేశీ పక్షాలకు అవకాశం ఇవ్వకూడదు.. అన్న సందేశం అందులో ఉంది.

### ఊహించనిదే జరిగింది

సిరియాలో తిరుగుబాటుదారులు తమ స్థావరమైన ఇద్లిబ్ నుంచి అలెప్పో నగరం దిశగా పయనమైనప్పుడు సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ అధికారాన్ని కోల్పోతారని, రెండు వారాల్లోపే డమాస్కస్ హస్తగతమవుతుందని ఎవరూ ఊహించలేదు. బషర్ అల్-అస్సాద్ తండ్రి హాఫీజ్ అల్-అస్సాద్ 1971 నుంచి 2000 వరకు సిరియాలో అధికారంలో ఉన్నారు. 2000 నుంచి అధికారం బషర్ అల్‌అస్సాద్ చేతుల్లోనే ఉంది. కానీ ఆ దేశంపై ఇరాన్, రష్యా, తుర్కియే ప్రభావం ఎక్కువ. రాజకీయ, సైనిక వ్యూహాలకు బషర్ ఆ దేశాలపై ఆధారపడడం కూడా ఎక్కువే. 2011లో ప్రారంభమైన అరబ్ స్ప్రింగ్ (ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు) తర్వాత బషర్ అల్-అస్సాద్‌కు కష్టాలు పెరిగాయి. రాజీనామా చేయాలని ఆయనపై ఒత్తిడి వచ్చింది. దీనికి అమెరికా మద్దతిచ్చినా అది సాధ్యపడలేదు. కానీ ఉన్నట్లుండి ఆయన పారిపోవాల్సి వచ్చింది. దీనికి ప్రధాన కారణం ఆయనకు ఇన్నేళ్లూ తోడ్పాటు నందిస్తూ వచ్చిన ఇరాన్, రష్యాలు తామే యుద్ధ సంక్షోభాల్లో కూరుకుపోవడం. హమాస్, హెజ్బొల్లాలపై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్‌ను కట్టడి చేయాలన్న లక్ష్యంతో హమాస్,హెజ్బొల్లాలకు ఇరాన్ అన్నీ తానై అండగా నిలుస్తోంది. ఈ ఘర్షణల్లో ఇరాన్ కూడా కీలక కమాండర్లను కోల్పోయింది. ఇజ్రాయెల్ దాడుల్లో కీలక ఆయుధ సంపత్తిని నష్టపోయింది. తాజాగా ఇజ్రాయెల్ సిరియాలో పలు ప్రాంతాలపై వైమానిక దాడులు చేసింది. సిరియాలోని ఆయుధాలు తిరుగుబాటుదారుల చేతుల్లో పడకుండా ఉండేందుకు ఆయుధాలను నాశనం చేయడానికి దాడులు చేసినట్లు సమర్థించుకుంది.

### అనునిత్యం అంతర్యుద్ధాలే

మరోవైపు రష్యా దాదాపు మూడేళ్లుగా ఉక్రెయిన్‌తో యుద్ధంలో ఉంది. అమెరికాతో పాటు నాటో దేశాలన్నీ ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలవడంతో రష్యా కూడా తన శక్తి యుక్తులన్నింటినీ ఉక్రెయిన్‌పై కేంద్రీకరించింది. ఇదే అదనుగా భావించిన తిరుగుబాటుదారులు డమాస్కస్‌ను ఆక్రమించారు. అంటే అసద్.. సొంత రాజకీయ, సైనిక బలం కన్నా రష్యా, ఇరాన్ వంటి బలమైన దేశాల తోడ్పాటుతోనే అధికారం చలాయిస్తున్నారన్నది సుస్పష్టం. ఆ పరిణామాలతోనే సిరియా సార్వభౌమత్వంలోని డొల్లతనం అర్థమవుతోంది. వాస్తవానికి సిరియాలో ముస్లింల జనాభా ఎక్కువగా ఉన్నా, ఆ దేశ రాజ్యాంగంలో అధికారిక మతం ప్రస్తావన లేదు. సిరియా ఒక రిపబ్లిక్, రాజ్యాంగ పరంగా లౌకిక దేశం. పరిపక్వం చెందిన రాజకీయ వ్యవస్థ అక్కడలేదు. దేశవ్యాప్తంగా చాలా తిరుగుబాటు గ్రూపులున్నాయి. నిత్యం అంతర్యుద్ధం జరుగుతూనే ఉంటుంది. వాటిని అణచివేయడంలోనే అధ్యక్షుడి యంత్రాంగమంతా నిమగ్నమై ఉంటుంది.

### అంతా మారిపోతుందనుకోలేం

భౌగోళికంగా సిరియా కీలక ప్రాంతంలో ఉంది. ఆ దేశానికి ఏం జరిగినా, అది కేవలం పొరుగుదేశాలనే కాదు ప్రపంచాన్నే ప్రభావితం చేస్తుంది. 2011 నుంచి కొనసాగిన 13 ఏళ్ల అంతర్యుద్ధమే ఇందుకు నిదర్శనం. అమెరికా, రష్యా, ఇరాన్, తుర్కియే ఇలా పలు దేశాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఈ అంతర్యుద్ధంలో కీలకపాత్ర పోషించాయి. అందుకే అసద్ ప్రభుత్వం పడిపోవడంవల్ల అంతా మారిపోతుందని అనుకోవడం అత్యాశే అవుతుంది. తిరుగుబాటుకు నేతృత్వం వహించిన హయాత్ తహరీర్ అల్-షామ్(హెచ్‌టీఎస్), సిరియా నేషనల్ ఆర్మీ(ఎస్‌ఎన్‌ఏ)లే అయినా, ఇంకా చాలా గ్రూపులు సిరియాలో ఉన్నాయి. ఇవన్నీ రానున్న రోజుల్లో ఏకతాటిపైకి వస్తేనే సిరియాలో శాంతి నెలకొంటుంది. లేదంటే సంక్షుభిత ప్రాంతంగానే కొనసాగుతుంది. హెచ్‌టీఎస్ గత చరిత్ర ఏమంత ఘనంగా లేదు. తాము ఆక్రమించిన ప్రాంతాల్లో ఇస్లామిక్ చట్టాలనే గతంలో అనుసరించింది. దక్షిణ సిరియాలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇక్కడ స్థానిక తిరుగుబాటుదారులు చాలా ప్రాంతాలను ఆక్రమించుకున్నారు. తుర్కియే సరిహద్దుల్లో కుర్దు మిలిటెంట్ల సమస్య కూడా సిరియా భవిష్యత్తుపై కీలక ప్రభావాన్ని చూపిస్తుంది. కుర్దులను ఎదుర్కోవడానికి ఉత్తర సిరియాలో తుర్కియే చాలా ఏళ్లుగా తన సైన్యాలను మోహరించింది. కుర్దు మిలిటెంట్లకు అమెరికా మద్దతిస్తోంది. సిరియాలోని ఉత్తర, ఈశాన్య ప్రాంతాల్లో ఐసిస్ నుంచి ముప్పుపొంచి ఉంది. వీరికి అడ్డుకట్ట వేయడానికి అమెరికా తన దళాలను సిరియాలో మోహరించింది. ఇలా సిరియాలోని ప్రాంతాలను అనేక గ్రూపులు పంచుకున్నాయి. వీటన్నింటిని ఏకతాటిపైకి తీసుకురావడమే డమాస్కస్‌లో పాలనా పగ్గాలు చేపట్టేవారికి అతిపెద్ద సవాల్. ఇలాంటి జటిలమైన సమస్యల సవాళ్ళెన్నో సిరియాను చుట్టుముట్టి ఉన్నాయి. వీటిని ఎలా అధిగమిస్తారో వేచిచూడాల్సిందే!



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# పేద విద్యార్థుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం!

## - మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



విద్యారంగంలో ప్రభుత్వం వేస్తున్న ప్రతి అడుగూ పేద బిడ్డల ఉజ్వల భవిష్యత్తు కోసమేనని, పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబు ఆలోచనతో రాష్ట్ర చరిత్రలో ఒకే రోజున 45వేల పాఠశాలల్లో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించడం చరిత్రాత్మకమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కొనియాడారు. ఆత్మకూరు ప్రభుత్వ హైస్కూలులో ఇటీవల జరిగిన తల్లితండ్రులు-ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద విద్యార్థుల విద్య కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు పెడుతోందని, ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే తాను కూడా ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల కంటే నాణ్యమైన విద్యా బోధన ప్రభుత్వ పాఠశాలల ద్వారానే లభిస్తుందని, ప్రైవేటు పాఠశాలల్లో ఇంటర్ చదివినవారు కూడా పాఠాలు బోధిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని విధాల క్వాలిఫైడ్ టీచర్లు విద్యాబోధన చేస్తున్నారని ఆయన తెలిపారు. అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల వైపు నడిపించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. విద్యార్థులందరూ భారత మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకొని అనుకున్న లక్ష్యాల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. విద్యతో పాటు క్రీడల వైపు కూడా విద్యార్థులు ఆసక్తి కనపరచాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం ఇటీవల ఆత్మకూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ క్రీడల్లో ప్రతిభ చూపి పంజాబ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన 160 మంది విద్యార్థులకు తన సొంత నిధులతో ట్రాక్‌సూట్లను మంత్రి ఆనం అందజేశారు.

## విద్యుత్ సమస్యలపై.. సమీక్ష

జిల్లాలోని ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై ఇటీవల మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో చర్చించారు. విద్యుత్ శాఖ ఎస్ఇ విజయన్, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రైల్వే లైను, జాతీయ రహదారులు వంటి ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నందున విద్యుత్ శాఖకు సంబంధించి చేపట్టాల్సిన సత్వర చర్యల కోసం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా పలు సూచనలు చేశారు. ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు, రైతులకు విద్యుత్ సరఫరాలను మెరుగుపరచాలన్నారు. ఆ నియోజకవర్గ పరిధిలోని పెరుమాళ్లపాడు, ఆమని చిరువెల్ల, వెంకట్రావుపల్లి, అన్నారెడ్డిపాలెం, కావలి ఎడవల్లి గ్రామాల సమీపంలో కొత్త ట్రాన్స్‌ఫార్మలను ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు.

# విజయసాయిరెడ్డి బతుకంతా..

# అవినీతి..దోపిడీలే!



## - సోమిరెడ్డి ధ్వజం

వైకాపా నాయకుడు విజయసాయిరెడ్డి బతుకంతా అవినీతి, అరాచకాలు, దోపిడీలేనని, అక్రమాల్లో ఏ2 నుంచి ఏ1గా మారుతున్న విజయసాయిపై చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి, టీడీపీ నాయకుడు.. సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన అమరావతిలోని అసెంబ్లీ ప్రాంగణంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై కనీస గౌరవం, మర్యాద లేకుండా విజయసాయి చేస్తున్న ఆరోపణలు, పొంతనలేని వ్యాఖ్యానాలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు అరబిందో ఫౌండేషన్ పేరుతో దోపిడీ, మరోవైపు విశాఖలో భూకబ్జాలు చేసిన ఆ పెద్దమనిషి ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సామాజిక మాధ్యమాల్లో అసత్య పోస్టులు పెట్టినవారిని పోలీసులు అరెస్టు చేస్తున్నారని, అయితే విజయసాయికి ఎందుకు మినహాయింపు ఇస్తున్నారో అర్థం కావడం లేదని ఆయన అన్నారు. కాకినాడ ఓడరేవు ద్వారా రేషన్ బియ్యం అక్రమ ఎగుమతుల్లోనూ విజయసాయి హస్తం ఉందని, ప్రతి అక్రమ వ్యవహారంలోనూ ఆయన పాత్ర ఉందని ఆరోపించారు. ఇకనైనా విజయసాయిరెడ్డి ముఖ్యమంత్రిపై అడ్డగోలు వాగుడును కట్టిపెట్టాలని, లేకుంటే సహించేది లేదని అన్నారు. విజయసాయిరెడ్డి అక్రమాలపై విచారణ జరిపి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# వేద విజ్ఞాన వేదిక సభ..29న

చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా 156వ కార్యక్రమం డిసెంబరు 29వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు వేదిక అధ్యక్ష కార్యదర్శులు జెకె రెడ్డి, కందనూరు మధు తెలిపారు. ఆరోజు సాయంత్రం 6.30 గంటలకు చెన్నై-టీనగర్‌లోని కృష్ణహాల్, ఆంధ్రాక్లబ్‌లో విశ్రాంత ఆంగ్లోపన్యాసకులు బొడ్డపాటి చంద్రశేఖర్ (విజయవాడ) పాల్గొని 'శ్రీపాద కథలు-గోదావరి గలగలలు' అనే అంశంపై ప్రసంగిస్తారని, సాహితీప్రియులందరూ ఈ కార్యక్రమానికి తరలిరావాలని వారు కోరారు.

---

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్


# పేదల భూములు ఆక్రమిస్తే చర్యలు

## ఎమ్మెల్యే సునీల్‌కుమార్



పేదల భూములను ఆక్రమించి, దర్జాగా అనుభవిస్తున్న భూస్వాములపై ఉక్కుపాదం మోపాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. చిల్లకూరులోని ఉన్నత పాఠశాలలో ఈ నెల 10న నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాతో కలిసి పాల్గొన్నారు. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే ఆక్రమణదారులపై కఠినచర్యలు తీసుకొంటామని స్పష్టం చేశారు. చిల్లకూరు పంచాయతీని గూడూరు మున్సిపాలిటీ నుంచి తొలగించే విధంగా పురపాలక మంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. చిల్లకూరు తహశీల్దార్ శ్రీనివాసులు, పెంచలకోన ఆలయ మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ, నాయకులు పట్టాభిరెడ్డి, రామచంద్రారెడ్డి, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

# విష జ్వరాల నుండి ప్రజలను కాపాడండి



గూడూరు పట్టణంలో గత రెండు వారాలుగా విషజ్వరాలు విపరీతంగా పెరిగి ప్రజలు అవస్థలు పడుతున్నారని, దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలని పురపాలక శాఖ కమిషనర్‌కు సీపీఐ, ఇన్సాఫ్ నాయకులు ఇటీవల వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన సీపీఐ, ఇన్సాఫ్ నాయకులు మాట్లాడుతూ పట్టణంలో చికెన్ గున్యా, డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి విష జ్వరాలు తీవ్రంగా ప్రబలి ప్రతి ఇంట్లో జ్వరపీడితులు ఉంటున్నారని, అలాగే కుక్కల బెడద కూడా తీవ్రంగా ఉందన్నారు. వీటిపై తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు.

# బ్రాహ్మణ సేవాసంఘ అధ్యక్షుడిగా ఆనిమెళ్ళ

- గౌరవాధ్యక్షుడిగా యరగుడిపాటి చలపతిరావు





గూడూరు రెండో పట్టణంలోని ముంగమూరు సీతమ్మ బ్రాహ్మణ భవనంలో ఈ నెల 8వ తేదీ గూడూరు బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య అధ్యక్షులు యరగుడిపాటి చలపతిరావు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. గూడూరు పట్టణ డీఎస్పీ రమణకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా యరగుడిపాటి చలపతిరావు, అధ్యక్షులుగా ఆనిమెళ్ళ శివకుమార్, సెక్రటరీగా చిట్టమూరు శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా విద్యులలిత, కమిటీ మెంబర్లను ఎన్నుకోవడం జరిగింది.

# ఆర్చరీ క్రీడాకారులకు ప్రోత్సాహకాలు



గూడూరు వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ దాతృత్వంతో ఇటీవల ఆర్చరీ క్రీడాపోటీలలో జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించిన తరునీష్ జత్యకి రూ.30వేలు, కోచ్ శంకర్‌కు రూ.20వేలు ప్రోత్సాహకాలుగా అందజేశారు. అలాగే జాతీయ స్థాయిలో పాల్గొన్న ఏడుమంది ఆర్చరీ క్రీడాకారులకు జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు నుండి హాకీలో, క్రికెట్‌లో జాతీయ స్థాయి క్రీడాకారులున్నారని, అదేవిధంగా ఆర్చరీలో కూడా ఇంతమంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణిస్తుండడం హర్షించదగ్గ విషయమన్నారు. ఆర్చరీలో ఉన్నతంగా రాణిస్తున్న గూడూరు క్రీడాకారులు త్వరలో ఒలింపిక్స్ స్థాయికి ఎదిగి గూడూరుకు మంచి పేరు తేవాలని కోరుకుంటున్నానన్నారు. వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, వసంత్‌కుమార్, సేగు వెంకటేశ్వర్లు, బెజవాడ రమేష్ పాల్గొన్నారు.



## అండర్ 14 రాష్ట్ర క్రికెట్ జట్టు

# ప్రాబబుల్‌గా లీలా వికాస్

గూడూరులోని అల్లూరి ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలోని ఏసీఏ సబ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారుడు లీలా వికాస్ అండర్ 14 రాష్ట్ర క్రికెట్ జట్టు ప్రాబబుల్‌గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా నెల్లూరుజిల్లా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కొనిదల మునిగిరీష్ మాట్లాడుతూ ఏసీఏ సబ్ సెంటర్ నుండి ఇప్పటివరకు ఆరుగురు క్రీడాకారులు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని, ఈ నెలలో విజయనగరంలో జరిగే ప్రాబబుల్స్ మ్యాచులలో లీలావికాస్ ప్రతిభ కనబరిస్తే తప్పకుండా రాష్ట్ర జట్టులో మంచి ఆల్‌రౌండర్‌గా అవకాశం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కోచ్ లవకుమార్, క్రికెట్ క్లబ్ కార్యదర్శి తూపిలి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## అక్రమ సస్పెన్షన్లను

# రద్దు చేయాలి

కండక్టర్, డ్రైవర్ల అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలంటూ సిఐటియు అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో గూడూరు ఆర్టీసీ డిపో ఎదుట జరుగుతున్న నిరసన కార్యక్రమం బుధవారానికి ఏడవరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి డి.శ్రీధర్ మాట్లాడుతూ ఇప్పటికైనా యాజమాన్యం అక్రమ సస్పెన్షన్‌లను రద్దు చేసి ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సీఎంని కలసిన.. ఎమ్మెల్యే కాకర్ల



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఈనెల 10న అమరావతిలో కలసి, ఉదయగిరి నియోజకవర్గ సమస్యలను, చేయాల్సిన అభివృద్ధిపనుల నివేదికను అందజేస్తున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్.

## కళ్యాణ వైభవం...!




నెల్లూరు వాస్తవ్యులు సురి పాండురంగారెడ్డి - సుధారాణిల కుమార్తె **సాయిఅక్షిత - హర్షవర్ధన్** (కోవూరు వాస్తవ్యులు పూనూరు మధుసూధన్‌రెడ్డి - సుజాతల కుమారుడు)ల వివాహం డిసెంబర్ 5వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.




ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్, నెల్లూరు వాస్తవ్యులు చుండి వెంకట సుబ్రహ్మణ్యం - విజయలక్ష్మిల కుమారుడు **శ్రీరామ్ కుమార్ - ఆమని** (గుంటూరు వాస్తవ్యులు తురగా శ్రీధర సత్యసాయి - అనూరాధల కుమార్తె)ల పరిణయం డిసెంబర్ 6వ తేదీ గుంటూరులో వైభవంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.




నెల్లూరు వాస్తవ్యులు గోళ్ళమూడి శ్రీధర్‌రెడ్డి - అనుపమల కుమారుడు **శరత్‌కుమార్‌రెడ్డి - పావనిరెడ్డి** (నెల్లూరు వాస్తవ్యులు చిలకల శ్రీనివాసులరెడ్డి - పద్మావతిల కుమార్తె)ల పెళ్ళి ఇటీవల నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# విద్వేషపు నీడలో రాజకీయ క్రీడ

(మొదటిపేజీ తరువాయి)

సంస్కృతిని అవమానించడం సరికాదని తెలంగాణ ప్రాంత నేతలను నిలదీయలేదు. తెలంగాణ ప్రాంత నాయకులకు, అక్కడి సమాజంలోని కొంతమంది వ్యక్తులకు ఆంధ్ర ప్రాంతం అంటే చులకనైపోయింది. ఆంధ్ర అని గుర్తొచ్చినప్పుడల్లా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఆంధ్రులు పాటించే సంప్రదాయాలు, ఆచారాలు, సంస్కృతి, భాష పూర్తిగా తమ సొంతమని, అవి మరెక్కడా లేవని మాట్లాడుతున్నారు. తమని తాము మేధావులమన్నట్లుగా చిత్రీకరించుకుంటున్నారు. ఒక భాష మాట్లాడే ప్రాంత పరిధి పెద్దదిగా ఉన్నప్పుడు భాషలో సారూప్యం ఎంత ఉంటుందో వైరుధ్యం అంతే ఉంటుంది అన్న కనీస స్పృహ కూడా లేకుండా మాట్లాడుతున్నారు.

### యాస వేరైనా భాష ఒక్కటే!

ఆధునిక సమాచార వ్యవస్థలు, రవాణా సదుపాయాలు లేని కాలంలో దాదాపు ప్రతి 20కిలోమీటర్లకు భాషలో, సంస్కృతిలో మార్పు ఉంటుందన్న సంగతి తెలియక నోటికొచ్చినట్లు విమర్శిస్తున్నారు.

తెలంగాణ ప్రాంతంలో సైతం ఉత్తర తెలంగాణ ఆచార వ్యవహారాలకి, దక్షిణ తెలంగాణ ఆచార వ్యవహారాలకి మధ్య చాలా వైరుధ్యం ఉంటుంది. భాష యాసలోను చాలా తేడా ఉంటుంది. హైదరాబాద్ పాతబస్తీ ఆచార వ్యవహారాలకు, అక్కడి భాష యాసలకు, తెలంగాణలోని ఇతర ప్రాంతాలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. నేతలు తమ పబ్బం గడుపుకోవడం కోసం ఇటువంటి వాస్తవాలని మరుగున పెట్టి ఆంధ్ర ప్రాంతంపై విషం చిమ్ముతూనే ఉన్నారు.

సాహితీవేత్తలమని, భాషావేత్తలమని చెప్పుకునే కొంతమంది తెలంగాణ ప్రాంత వ్యక్తులు కొన్ని తెలుగు పదాలను ఉదహరిస్తూ ఆ పదాలు తెలంగాణ సొత్తు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది ఖచ్చితంగా ఆంధ్ర ప్రాంతంపై సాంస్కృతిక దాడే. ఎందుకంటే.. వారు పేర్కొనే పదాలు ఆంధ్ర ప్రాంతంలోనూ, ముఖ్యంగా ఆంధ్ర ప్రాంతపు పల్లెల్లో విరివిగా వాడే పదాలే. ఉదాహరణకు చల్ల(మజ్జిగ), ఎర్ర(వానపాము) వంటి పదాలు అచ్చ తెలంగాణ పదాలని వారు చెప్పుకుంటున్నారు. కానీ, ఈ పదాలను ప్రాంతాలకు అతీతంగా అన్నిచోట్ల పల్లెల్లో ఇప్పటికీ వాడుతూనే ఉన్నారు.

వాస్తవానికి ఆంధ్ర సంస్కృతి పైనే ఎక్కువ దాడి జరుగుతోంది. మరుగున పడిపోయింది, మరుగున పడుతోంది ఆంధ్ర ప్రాంతంలోని వివిధ మాండలికాలు, యాసలే. శిష్ట వ్యావహారికం, పత్రికా భాష ఎప్పుడైతే జన బాహుళ్యంలోకి విరివిగా వచ్చి చేరిందో.. అప్పుడే ఆంధ్ర ప్రాంతంలోని కొన్ని జిల్లాల్లో యాసలు మరుగున పడటం ప్రారంభమైంది. కృష్ణ, గుంటూరు జిల్లాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. కానీ, అక్కడి పల్లెల్లో ఇప్పటికీ ఒక ప్రత్యేక యాస ఉంటూనే ఉంది. శిష్ట వ్యావహారికం, పత్రికా భాష ప్రభావం తెలంగాణపై కాస్త తక్కువే. అందుకే తెలంగాణ భాష, యాస కొంత ప్రత్యేకంగా కనిపించవచ్చు. అంతమాత్రాన మా పదాలు ఇంకా ఎక్కడా లేవు అని సాంస్కృతిక ఆధిపత్య భావజాలం ప్రదర్శించడం భావ్యం కాదు. ఇలా అనేవారు ఒకసారి ఆంధ్ర ప్రాంతపు పల్లెల్లో తిరిగి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుంది. ముఖ్యంగా రాజకీయ నేతలు తమ పబ్బం గడుపుకోవడానికే ఇటువంటి తప్పుడు నిందలు వేస్తున్నారు. మేధోవర్గం వీటిని ఖండించాలి.

కేసీఆర్ కుటుంబం ఆంధ్ర ప్రాంతంతో బంధుత్వాలు కలుపుకుంటుంది, రేవంత్‌రెడ్డి కుటుంబం ఆంధ్ర ప్రాంతంతో సంబంధాలు కలుపుకుంటుంది. కానీ, ప్రజలేం పాపం చేశారు?... వారి మధ్య విద్వేషాలు ఎందుకు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.. అన్న విషయాన్ని మేధో సమాజం ప్రశ్నించాలి.

### తప్పటడుగులు నుండి తప్పించుకోవడానికే!

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆంధ్ర ప్రాంతంపై అక్కసు వెళ్లగక్కేముందు, మొన్నటి ఎన్నికలలో తన విజయం వెనక ముఖ్య భూమిక పోషించింది ఎవరో ఆయన గుర్తుతెచ్చుకోవాలి. ఆంధ్ర ప్రాంత ప్రజలు రేవంత్‌రెడ్డిని నెత్తినపెట్టుకన్నారు. తమ భుజాన మోసి ఆయన విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆ విషయాన్ని ఆయన మర్చిపోయి ఆంధ్ర ప్రాంతంపై అనవసర నిందలు మోపుతున్నారు, అవమానకరంగా మాట్లాడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో, సమైక్య పాలనలో తెలంగాణ సంస్కృతి అవమానాలకు, అవహేళనలకు గురైంది అంటున్న రేవంత్‌రెడ్డి, అప్పుడు ఎందుకు మాట్లాడలేదు? ఇప్పుడే ఎందుకు మాట్లాడుతున్నట్లు? తెలంగాణ తల్లి విగ్రహంపైన కేసీఆర్ కుటుంబం మాట్లాడే అవకాశం లేకుండా చేయడానికి ఆంధ్ర ప్రాంతం ప్రజలని సమిధలు చేయాలన్నది రేవంత్ లక్ష్యంగా కనపడుతోంది. తాను చేస్తున్న కొన్ని వ్యూహాత్మక తప్పిదాలు కప్పిపుచ్చుకోవడానికి ఆయన తెలంగాణ సమాజాన్ని దారి మళ్లిస్తున్నట్లు స్పష్టమవుతోంది. తన తప్పటడుగుల కారణంగా కేసీఆర్ మళ్ళీ హీరోగా అవతరించకుండా ఉండటానికి ఆంధ్ర ప్రాంత ప్రజలను బలి పశువులని చేయాలన్నది రేవంత్ వ్యూహంగా స్పష్టమవుతోంది.

### అవమానాలు ఇక చాలు!

మర్రి చెన్నారెడ్డి హయాం నుంచి ఇప్పటివరకు ఆంధ్ర ప్రాంత ప్రజలు పడిన అవమానాలు చాలు. ఇకనైనా తప్పుడు నిందలు ఆపాలి. అసలే రాష్ట్రం విడిపోయి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయింది ఆంధ్ర ప్రాంతం. మిగులు బడ్జెట్‌తో కళకళలాడింది తెలంగాణ రాష్ట్రం. దాన్ని మరింతగా అభివృద్ధి చేసుకొని తెలంగాణను దేదీప్యమానం చేసుకోవాలి. అంతే తప్ప లోటు బడ్జెట్‌తో, రాజధాని లేక అల్లాడిపోతున్న ఆంధ్ర ప్రాంతంపై విరుచుకుపడడం అన్యాయం, అధర్మం, అర్ధరహితం.

### పవన్ కళ్యాణ్ గళం విప్పాలి!

ప్రతిచిన్న విషయానికి ఆవేశంతో ఊగిపోయే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆంధ్ర ప్రాంత ప్రజలపై నిందలు పడుతుంటే మౌనంగా ఉండటం ఏమాత్రం సముచితంకాదు. ప్రశ్నిస్తా, ప్రశ్నిస్తా అనే పవర్‌స్టార్ ఈ వ్యవహారంలో మౌన వ్రతం పాటించడం సరికాదు. ఆంధ్ర, తెలంగాణ తనకు రెండు కళ్ళు అన్న చంద్రబాబు ఒక కంటిని అదే పనిగా బాధపెడుతుంటే చూస్తూ ఊరుకోవడం సబబు కాదు. ఆ భాష మాదే, ఆ పదాలు మావే అని ఒక వర్గ సమాజం భాషను దోపిడీ చేయాలని ప్రయత్నిస్తుంటే, ఆంధ్ర ప్రాంతపు సాహితీవేత్తలు, భాషావేత్తలు మాట్లాడకపోవడం బాధాకరం. ఎవరూ ఎవరిని దూషించాల్సిన అవసరం లేదు. కానీ, ఇలా మాట్లాడటం తప్పు అని చెప్పకపోతే పదేపదే చెప్పిన అబద్ధాలే నిజమని అందరూ నమ్మే పరిస్థితి వస్తుంది. ఇది ఆంధ్రా ప్రాంతానికి తీరని ద్రోహం అవుతుంది.

### తెలంగాణ నేతలలో మార్పు రావాలి!

ఇప్పటికే రాజకీయంగా అనైక్యంగా ఉండటంతో తెలుగు రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం వద్ద బలహీనంగా మారాయి. న్యాయబద్ధంగా రావలసిన వాటికి కూడా పదేపదే దేబిరించాల్సిన పరిస్థితి ఉంది. భౌగోళికంగా ఎలాగు విడిపోయాం, కనీసం ఇలాంటి నిందలు మోపటం ఆపి తెలుగు ప్రజలందరూ కలిసికట్టుగా ఉన్నాం అన్న సంకేతాన్ని బలంగా పంపిస్తే తప్పించి తెలుగు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వపరంగా న్యాయం జరగదు, సాయం అందదు. సాంస్కృతిక ఆదిపత్యాన్ని ప్రదర్శించేముందు, నిందలు మోపేముందు ఈ విషయాన్ని తెలంగాణ నేతలు గ్రహిస్తే రెండు రాష్ట్రాలకు మేలు చేసినవారు అవుతారు.

తమ స్వార్ధపూరిత ప్రయోజనాల కోసం ప్రజలలో విభేదాలని సృష్టించి విద్వేషపు నీడలో ఆడుతున్న రాజకీయ క్రీడలకి ఇకనైనా తెలంగాణ నేతలు స్వస్తి పలకాలి!

### డిసెంబరు 15న..

# శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి



ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన డిసెంబరు 15వ తేదీని శ్రీ పొట్టి శ్రీరాములు 'ఆత్మార్పణ దినం'గా నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం ఈనెల 7న తీసుకున్న నిర్ణయం పట్ల జిల్లాలో సంతోషం వ్యక్తమవుతోంది. ఆయన ఆత్మార్పణ చేసిన రోజును అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిగా జరుపుకోవాలని, ఆరోజున గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు స్ఫూర్తిదాయక కార్యక్రమాలు నిర్వహించాలని, పాఠశాలలు- కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు చేపట్టాలని కూడా ప్రభుత్వం ఆదేశించింది.

# అవినీతిపై పోరాటం సాగించాలి



సమాజాన్ని పట్టి పీడిస్తున్న అవినీతిపై ప్రతిఒక్కరూ అవిశ్రాంతంగా పోరాడాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఏఎండి ఇంతియాజ్ పిలుపునిచ్చారు. "అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం" సందర్భంగా పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ (నెల్లూరు) మరియు ఆంధ్ర లయోల కళాశాల(విజయవాడ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో 'అవినీతి అంతం- అదే మన పంతం' అనే అంశంపై కవిసమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య సంస్థల పునాదుల్ని ఈ అవినీతి బలహీన పరుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సమరం మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థల్ని, దేశ ఆర్థికాభివృద్ధిని అవినీతి రాకాసి కుంటుపరుస్తోందని అన్నారు. అనంతరం, విజయనగరం జిల్లా గుర్ల మండలానికి చెందిన అసిస్టెంట్ సబ్ఇన్స్పెక్టర్ డాక్టర్ బి.కామేశ్వరరావు చేస్తున్న సేవలను అభినందిస్తూ ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అంతర్జాతీయ అధ్యక్షులు వేముల హజరత్తయ్య గుప్త సభాధ్యక్షులుగా వ్యవహరించి, అవినీతికి వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఏ.పి.కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, గాంధీ దేశం వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాకులు ఆర్.ఆర్.గాంధీ నాగరాజన్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు, డాక్టర్ కె.శేఖర్, లెక్చరర్స్ పాల్గొన్నారు.

# అంధులకు..ఆర్‌వి‌ఆర్ ఫౌండేషన్ సాయం




నెల్లూరులోని విశ్వభారతి అంధుల పాఠశాలలోని పిల్లలకు స్థానిక ఆర్.వి.ఆర్ ఫౌండేషన్ ఆర్గనైజర్ మోహన్‌రాజు (ఆర్‌విఆర్) ఆధ్వర్యంలో ఇటీవల తమ చేయూతనందించారు. ఆ పాఠశాల చిన్నారులకు నూతన వస్త్రాలు, పండ్లు-స్వీట్లు పంపిణీ చేశారు.

# 14న దత్త జయంతి వేడుకలు

ఈనెల 14న శ్రీ దత్తాత్రేయ జయంతి సందర్భంగా నెల్లూరు నిప్పోసెంటర్‌లోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో వేడుకలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆరోజు ఉదయం 6.30 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకం, 8 గంటలక సహస్ర నామార్చన, 10 గంటలకు రుద్రహోమం, దత్త హోమం, 11.30కి పూర్ణాహుతి, మధ్యాహ్నం 12గంటలకు హారతి కార్యక్రమాలుంటాయని వారు పేర్కొన్నారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

### పరిశ్రమలకు విశిష్ట గుర్తింపుపై..

# శ్రీసిటీలో అవగాహన సదస్సు



పరిశ్రమలకు ఎన్ఏబిఎల్ గుర్తింపు ప్రాధాన్యత, దానిద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఇటీవల శ్రీసిటీలో పరిశ్రమల వారికి అవగాహన కల్పించారు. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూ.సి.ఐ) అనుబంధ సంస్థ నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ (ఎన్ఏబిఎల్), శ్రీసిటీ సహకారంతో..ఎన్ఏబిఎల్ బెంగళూరు ప్రాంతీయ కార్యాలయం వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటైంది. శ్రీసిటీ మరియు పరిసర ప్రాంతాలలోని వివిధ రంగాల పరిశ్రమలకు చెందిన 50 మందికి పైగా నాణ్యతా నిపుణులు పాల్గొన్నారు. ఎన్ఏబిఎల్-క్యూసిఐ డెప్యూటీ డైరెక్టర్ డి.రంజిత్ కుమార్ వారందరికీ అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఎగుమతి పరిశ్రమలకు ఎన్ఏబిఎల్ గుర్తింపు వల్ల దేశీయంగా, అంతర్జాతీయ పోటీ మార్కెట్లో చేకూరే ప్రయోజనాలను వివరించారు. ఎన్ఏబిఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీరామ్ పిన్నమరాజు మాట్లాడుతూ ఎన్ఏబిఎల్ వెబ్‌సైట్, అందులోని వనరులు, డాక్యుమెంటేషన్ గురించి వివరించారు. అనంతరం శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కార్యక్రమ ప్రాముఖ్యత గురించి వ్యాఖ్యానిస్తూ, శ్రీసిటీని ప్రపంచస్థాయి తయారీకేంద్రంగా తీర్చిదిద్దడంలో ఎన్ఏబిఎల్ గుర్తింపు అవసరమని, ఇలంటి కార్యక్రమాలు దానిపై పూర్తి అవగాహన కలిగిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతి ఐఐఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతనూ భట్టాచార్య ప్రారంభించగా, ముఖ్య అతిథిగా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా. వై.వి.రామిరెడ్డి, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 'డైట్'లో ఉత్సాహంగా..'కళా ఉత్సవ్'



ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలో ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థ 'డైట్'లో ఇటీవల జిల్లాస్థాయి 'కళా ఉత్సవ్-2024' వేడుకలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో, సీనియర్ ఛాత్రోపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులలో దాగివున్న వివిధ రకాల కళా నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా ప్రతి సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖలు, యస్.సి.ఇ.ఆర్.టి, జిల్లా విద్యాశాఖ, ప్రభుత్వ డైట్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్రస్థాయిలోనే కాక జాతీయస్థాయిలో కూడా కళాఉత్సవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈసారి జిల్లాలోని 6 పాఠశాలల నుండి మొత్తం 40 మంది విద్యార్థులు 6 విభాగాలలో పోటీపడ్డారని, ఒక్కో కళారూపంలో ప్రథమ స్థానంలో నిలిచినవారు రాష్ట్రస్థాయి కళాఉత్సవ్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ ఎప్పుడు ఎక్కడ జరిగేదీ త్వరలోనే తెలుస్తుందన్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఉపాధ్యాయులు యమ్.అనూష(ఆత్మకూరు), కె.దొరస్వామి, పి.లక్ష్మయ్య(పల్లిపాడు) వ్యవహరించారని ఆయన తెలిపారు. డైట్ ఉపన్యాసకులు డి.నర్సింగరావు, యస్.బి.దాస్, కె.విజయచంద్ర, ఎన్.శివ, కె.షఫీఅహ్మద్, సూపరింటెండెంట్ ఎం.మేరీ ప్రసూన, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ నివారణకు అవగాహనే మందు



క్యాన్సర్ నివారణకు ఆ వ్యాధిపట్ల అవగాహనే ముఖ్యమని, ముందుగానే గుర్తిస్తే దానిని నిరోధించవచ్చని క్యాన్సర్ ఆసుపత్రి సిఎంఇఓ డాక్టర్ లక్ష్మి చెప్పారు. ఇటీవల ఆమె నగరంలోని అబైండింగ్ హోప్ ట్రస్ట్ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆ ట్రస్ట్ ఛైర్మెన్ డాక్టర్ నిర్మల్‌కుమార్ గత మూడు సంవత్సరాల నుంచి దాదాపు 300 మందికి ఒక్కొక్కరికి 1500 రూపాయల విలువైన న్యూట్రిషన్ ఫుడ్‌ను ప్రతినెల అందజేస్తున్నారని, అదేవిధంగా క్యాన్సర్ పేషెంట్లకు కూడా అందజేయాలనుకోవడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ఇచ్చే మందులతో పాటు న్యూట్రిషన్ ఫుడ్‌ను వినియోగించుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఆమె తెలిపారు. అనంతరం, క్యాన్సర్ పేషెంట్లకు న్యూట్రిషన్ ఫుడ్‌పాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మెన్ డాక్టర్ నిర్మల్‌కుమార్. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషా కిరణ్. ఏ. జయప్రకాష్, డాక్టర్ గీత, ఉషశ్రీ. కన్యాకుమారి, వెల్డింగ్ స్టాన్ తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### పెంచలకోనలో కన్నులపండువగా..

### శ్రీ నృసింహస్వామి కల్యాణం

రాపూరు మండలం పెంచకోనలో వెలసివున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం..ఆదిలక్ష్మి-చెంచులక్ష్మీ దేవేరుల సమేత శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఇటీవల స్వామి-అమ్మవార్ల కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ డెప్యూటి కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

### జలదంకిలో..శ్రీ సాయి సేవా ట్రస్టు వితరణ

మండలకేంద్రమైన జలదంకిలోని నెహ్రూనగర్‌లో ఇటీవల శ్రీ సాయి సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి చేతులమీదుగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మండల బీజేపీ కార్యదర్శి ఎం.కిషోర్‌రెడ్డి, ట్రస్టు నిర్వాహకులు అళహరి పద్మావతి, సునీత, టి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### కందుకూరులో పేద విద్యార్థులకు విద్యాసామగ్రి

మండల కేంద్రమైన కందుకూరులోని మండల ప్రాథమిక పాఠశాలలోని నిరుపేద విద్యార్థులకు స్థానిక వాసవి క్లబ్ లెజెండ్స్ ప్రెసిడెంట్ డాక్టర్ రవ్వా శ్రీనివాసులు, కార్యదర్శి ఇన్నమూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇటీవల విద్యాసామగ్రి పంపిణీ చేశారు. హెడ్మాస్టర్ జయవరపు పద్మ, రవ్వా అరుణ, చీదెళ్ళ కృష్ణ, చెంగాదేవి, మంజులత, జనార్ధన్‌రావు పాల్గొన్నారు.

### జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ

జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఇటీవల అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఖాదర్‌వలీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యసిబ్బందికి చెప్పారు. డాక్టర్ అహ్మద్‌బాబు, డాక్టర్ అవంతి, సిహెచ్‌ఓ సుబ్బమ్మ, యాసిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### అన్నగారిపాళెం వద్ద కోడిపందెంరాయుళ్ల అరెస్ట్

కావలి సమీపంలోని అన్నగారిపాళెం అటవీప్రాంతంలో ఇటీవల కోడిపందాలు నిర్వహిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి 7250 రూపాయలతో పాటు 5 కోడిపుంజులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. సీఐ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### తాళ్లపూడిలో పెరటితోటల పెంపకంపై శిక్షణ

ముత్తుకూరు మండలం తాళ్లపూడిలో మహిళలకు ఈనెల 9న ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞానకేంద్రం వారు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళలకు కోడిపిల్లలను, వరిరైతులకు జీవన ఎరువులను అందజేశారు. సమన్వయకర్త డాక్టర్ శివజ్యోతి, శాస్త్రవేత్తలు ఆర్.సుజాత, కె.కిరణ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ ఏఓ జ్యోత్స్నరాణి పాల్గొన్నారు.

### రామతీర్థం హైస్కూలుకు బీరువాల వితరణ

విడవలూరు మండలంలోని రామతీర్థం జడ్పీ హైస్కూలుకు బాషా యూత్ ఫౌండేషన్ ఛైర్మెన్ వనమాల జనార్ధన్‌రావు ఈనెల 9న మూడు బీరువాలను వితరణగా ఇచ్చారు. స్కూలు పరికరాలను, ఫైళ్ళను భద్రపరచుకునేందుకు హెడ్మాస్టర్ శేషయ్యకు వాటిని అందజేశారు. టీడీపీ నాయకుడు కటారి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పొదలకూరు వైద్యశాల తనిఖీ

పొదలకూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఈనెల 9న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ ఆకస్మికంగా సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును పరిశీలించారు. వైద్యాధికారులు ప్రసాద్, పద్మావతి పాల్గొన్నారు.

### మనుబోలు విశ్వనాథునికి రుద్రాభిషేకం


మనుబోలులో చెర్లోపల్లి రైల్వేగేటు వద్దనున్న శ్రీ విశ్వనాథ స్వామి దేవాలయంలో ఈనెల 9న స్వామివారికి అత్యంత వైభవంగా ప్రత్యేకపూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎస్.కోటేశ్వరరావు-సుమలత ఉభయకర్తలుగా వ్యవహరించారు.

# విద్యార్థులను సమున్నతంగా తీర్చిదిద్దాలి



బాలలే భావిభారతానికి నిర్దేశకులని, విద్యలో వారిని సమున్నతంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లితండ్రులపై కూడా ఉందని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఇటీవల కోవూరు జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో జరిగిన తల్లితండ్రులు–ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిని సొంత బిడ్డలా ఆదరించించి నైతిక విలువతో కూడిన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. నేటి బాలలను ఉత్తమ భావిపౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులపై కూడా వుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా విద్యామంత్రి లోకేష్ ఎంతగానో కృషిచేస్తున్నారని ఆమె తెలిపారు. మచిలీపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో రన్నర్స్‌గా నిలిచి 12 వెండి పతకాలు సాధించిన విద్యార్థినులను ఆమె అభినందించారు. కోవూరు బాలికల పాఠశాలలో విద్యనభ్యసించి ప్రస్తుతం కొడవలూరు మండల గ్రామీణ నీటి సరఫరా సంస్థలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న హరితను ఆదర్శంగా తీసుకొని బాలికలంతా కష్టపడి చదవాలని కోరారు. ఇదే పాఠశాలలో గత సంవత్సరం చెవిటి, మూగ అయిన సమీరా అనే విద్యార్థిని 10వ తరగతిలో ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించడం వెనుక ఆమె తల్లి హసీనా కృషి గురించి తెలుసుకున్న ప్రశాంతిరెడ్డి, సమీరాను ఆమె తల్లిని సన్మానించారు. వైకల్యాన్ని జయించి చదువులో ప్రతిభ కనబరచిన సమీరా ఉన్నత విద్యా ఖర్చులను విపిఆర్ ఫౌండేషన్ భరిస్తుందని హామీ యిచ్చారు.

# ఎన్నికల నగారా మోగింది



## ★ సాగునీటి సంఘాల్లో వేడి మొదలైంది

**ఎట్టకేలకు సుదీర్ఘకాలం తర్వాత, సాగునీటి సంఘాల ఎన్నికలకు ఈనెల 11 బుధవారం నాడు నోటిఫికేషన్ విడుదల కావడంతో గ్రామాల్లో సందడి పెరిగింది. రైతులోకంలో ఎన్నికల వేడి రగులుకొంది.**

ఎప్పుడో ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఈ ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర విభజన తర్వాత అట కెక్కాయి. దీంతో సాగునీటి సంఘాల ఎన్నికలు ఇక జరగవు అనే నిరాశలో ఉండగా, కూటమి ప్రభుత్వం వచ్చాక, రైతుల అవసరాలను, ఆశలు.. ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయానికి అనువుగా రైతులందరికీ సాగునీటిని క్రమబద్ధంగా అందించేందుకు ఈ ఎన్నికలకు తిరిగి ఊపిరిపోసింది. దీంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది కూడా. అయితే, రేపోమాపో ఎన్నికలు జరుగుతాయని అందరూ భావిస్తున్న తరుణంలో వరుసగా మూడుసార్లు వాయిదాపడ్డాయి. ఇటీవల భారీవర్షాలు తదితర అనివార్య కారణాల వల్ల వాయిదా పడిన ఈ ఎన్నికలను తప్పనిసరిగా నిర్వహించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్న నేపథ్యంలో, ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల కావడంతో గ్రామాల్లో ఎన్నికల నగారా మోగినట్లయింది. అందులోనూ నెల్లూరుజిల్లాలో వ్యవసాయానిదే పెద్దపీట కనుక, సాగునీటి సంఘాల పదవులకు ఆయా పార్టీల నాయకులు, అనుచరవర్గాల నుంచి పోటీ పెరిగింది. దీంతో, నేతలకు వారిని సర్దుబాటు చేయడం ఒక పెద్ద తలనొప్పిగా తయారైంది. ఏకగ్రీవం దిశగా కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. రైతుల కష్టాలు తెలిసినవారు సాగునీటి సంఘాల పదవుల్లో ఉంటే ప్రయోజనకరంగా ఉంటుంది కనుక, ఆమేరకు ఆ పదవులను ఎవరికి కట్టబెట్టాలోనన్నది కూడా ఆయా ప్రాంతాల్లోని వారితో పాటు జిల్లాస్థాయి పార్టీవర్గాల్లో కూడా ముమ్మరంగా చర్చలు జరుగుతున్నాయి.

### 14న ఎన్నికలు

నెల్లూరుజిల్లా పరిధిలో 765 సాగునీటి సంఘాలు, 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 490 వాటర్‌యూజర్స్ సంఘాలు, 3698 టెరిటోరియల్ కాన్స్టిట్యుయన్సీ(టీసీ) సంఘాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 3 లక్షల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. జిల్లాలోని 6 ప్రాజెక్టు కమిటీలకు మినహాయించి, మిగిలిన డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, వాటర్‌యూజర్స్ సంఘాలకు, టీసీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈనెల 14న సాగునీటి సంఘాలకు, 17వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరుగనున్నాయి. సాగునీటి సంఘాలకు ఆ చెరువు పరిధిలో ఉన్న ఆయకట్టుదారులు ఓటర్లుగా ఉంటారు. వీరు సాగునీటి సంఘాల అధ్యక్షులను ఎన్నుకుంటారు. ఆ సాగునీటి సంఘాల అధ్యక్షులు ఈనెల 17న జరిగే ఎన్నికల్లో డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటారు. ఆ కమిటీ సభ్యులు ఆ తర్వాత ప్రాజెక్టు కమిటీ సభ్యులను ఎన్నుకునే విధంగా ఎన్నికల ప్రక్రియ ఉంటుంది. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా అధికారయంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంది. ఇవన్నీ దశలవారీగా పూర్తయితే, గ్రామాల్లో సాగునీటి సమస్యలు కూడా ఒక కొలిక్కివస్తాయి.

# నిబంధనల మేరకే వ్యవహరించా

## • ఆరోపణలపై జొన్నవాడ ఇఓ వివరణ



ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానం ఇఓ ఏవీ శ్రీనివాసులురెడ్డిపై ఇటీవల ఓ భక్తుడు చేసిన ఆరోపణలకు ఇఓ విచారణాధికారులకు తన వివరణ ఇచ్చారు. నవ రాత్రులు ముగిసిన తర్వాత అర్ధరాత్రి వేళ నిర్వహించే కాళరాత్రి నవావరణ పూజలు అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించలేదని, భక్తుల పట్ల ఇఓ అనుచితంగా ప్రవర్తించారని వచ్చిన ఆరోపణపై, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి విచారణ చేశారు. భక్తుని ఆరోపణలు, ఇఓ వివరణలను రికార్డు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ ఇఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి తన వివరణ ఇస్తూ, కాళరాత్రి నవావరణ పూజలకు ఆరోజున కేటాయించిన ఉభయదాతలు, వారి బంధు మిత్రులను మాత్రమే అనుమతించడం ఆలయ సంప్రదాయమని, అందుకే వేరెవరినీ అనుమతించలేదని తెలిపారు. ఎవరినీ అవమానించడం గానీ, ఆలయ నిబంధనలకు విరుద్ధంగా కానీ తాను ప్రవర్తించలేదని తెలిపారు. అదేవిధంగా అన్నదాన సత్రంలోకి వెళ్ళే, చొక్కాపట్టి బయటకు తోసేశాడంటూ వచ్చిన ఆరోపణకు సమాధానమిస్తూ, బయోమెట్రిక్ విధానంతో నిర్వహిస్తున్న అన్నదాన సత్రంలో, అందుకు విరుద్ధంగా వచ్చిన ఆ ఫిర్యాదుదారుడిని నిబంధనల మేరకు సహకరించాలని కోరామన్నారు. ప్రతిఒక్కరూ క్యూ పద్ధతి పాటించి బయోమెట్రిక్ వేయడం జరుగుతుందని, ఫిర్యాదుదారుడు ఆ నిబంధనలకు విరుద్ధంగా బయోమెట్రిక్ వేయకుండా, అన్నదాన సత్రం వెలుపలి మార్గం ద్వారా లోపలకి ప్రవేశించినందున, బయోమెట్రిక్ వేయాలని అన్నదాన సిబ్బంది కోరివున్నారని ఇఓ పేర్కొన్నారు. ఆరోజున ఉభయకర్తలను మాత్రమే అన్నప్రసాదానికి సత్రానికి అనుమతించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. తమ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు విచారణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.



## అయ్యప్పగుడిలో

# వైభవంగా మండల పూజలు

నెల్లూరు వేదాయపాళెంలో కొలువై వున్న శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం మండల పూజలు వైభవంగా జరిగాయి. కేరళ సంప్రదాయ కార్తీకమాస మండల పూజల్లో భాగంగా ఉదయం పాలాభిషేకం, మహాగణపతి హోమం, ఉష:పూజ, నవకాభిషేకం, శ్రీవేలి ఉత్సవం, సాయంత్రం మహాదీపారాధన, భగవతిసేవ, అత్తాళ్ళపూజ, పడి కర్పూరం, హరివరాసనం కన్నులపండువగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమాలు జరిగాయి. ఉభయకర్తలుగా బట్టేపాటి శ్రీనివాసులురెడ్డి–స్నేహలతమ్మ దంపతులు, బట్టేపాటి రంగారెడ్డి–అశితమ్మ దంపతులు, వెంకటేశ్, సందీప్‌లు వ్యవహరించారు.

# కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

## వైకాపా నేత రామ్‌కుమార్‌రెడ్డి



పార్టీ కార్యకర్తలకు తాము, తమ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటామని వైకాపా నేత, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. వాకాడులోని నేదురుమల్లి నివాసంలో సైదాపురం మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఈనెల 11న విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సైదాపురం మండలం చాగనం పంచాయతీకి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ చిరంజీవిపై తప్పుడు కేసులుపెట్టి పోలీసులు అరెస్టు చేశారని, సమిష్టిగా పార్టీవారంతా కలిసి ఆ విషయం అధికారులకు కూడా తెలియజేయడంతో, అది రిమాండ్‌కు పంపించే కేసు కాదని భావించి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారని ఆయన చెప్పారు. ఎప్పుడూ నిజమే గెలుస్తుందని, న్యాయవ్యవస్థ మీద తమకు నమ్మకం ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను, వారు తుంగలో తొక్కిన వాగ్దానాలను కూడా ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రజల అవసరాన్ని గుర్తించి రకరకాల పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు మేలు చేశారని, కూటమి ప్రభుత్వం అంతకంటే ఎక్కువ ఇస్తామని ఆశ చూపించి.. వాటిని అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు.

# ఘనంగా 'భారతీయ భాషా ఉత్సవ్'

ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు ప్రభుత్వ 'డైట్' విద్యాసంస్థలో ఈనెల 11న భారతీయ భాషా ఉత్సవ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగు, తమిళకవి సుబ్రహ్మణ్య భారతి చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించారు. మహాకవి సుబ్రహ్మణ్య భారతి జయంతి సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన విద్యాసంస్థల్లో భాషా ఉత్సవ్‌ను జరుపుతున్నామని తెలిపారు. ఉపన్యాసకులు డి.నరసింగరావు, ఎస్.బి.దాస్, ఎస్.శివ, కె.విజయచంద్ర, కె.షఫీఅహ్మద్, సూపరింటెండెంట్ ఎం.మేరీ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ శాఖలకు కొత్త అధికారులు

జిల్లాలో పలు సంక్షేమశాఖలకు రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో, ఇన్‌చార్జిలతోనే కాలం గుడుపుతున్న నేపథ్యంలో, ముఖ్యమైన శాఖలకు రెగ్యులర్ అధికారుల నియామకాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సాంఘిక సంక్షేమశాఖకు డిప్యూటీ డైరెక్టర్‌గా కె.శోభారాణిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కె.కన్నబాబు ఈనెల 11న ఉత్తర్వులిచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న శోభారాణికి, ప్రభుత్వం డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పించి నెల్లూరు సాంఘికసంక్షేమ శాఖకు బదిలీ చేసింది

### ఎస్సీ కార్పొరేషన్‌కు రెగ్యులర్ అధికారి

జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఇ.డి) పోస్టు కూడా గత కొంత కాలంగా ఖాళీగానే ఉంది. ఆ స్థానంలో ఇన్‌చార్జిని నియమించారు కానీ, రెగ్యులర్ అధికారి లేకపోవడంతో బీసీ కార్పొరేషన్ ఇ.డి ఈ శాఖలో ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా కె.అర్జున్ నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఒంగోలు ఎస్సీ కార్పొరేషన్ ఇ.డిగా ఉన్నారు. ఆయన్ను నెల్లూరుకు ఇ.డిగా బదిలీ చేయడంతో ఆ శాఖకు కూడా రెగ్యులర్ అధికారిని నియమించినట్లయ్యింది.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com